RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 315 మేడ్చల్ మల్కాజ్‌గిరి 6 డిసెంబర్ 2024 శుక్రవారం పేజీలు : 4

## ఎస్సీ కుల వర్గీకరణకు కర్ణాటక క్యాబినెట్ ఓకే

బెంగళూరు : షెడ్యూల్డు కులాల వర్గీకరణకు కర్ణాటక కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రయోగాత్మకంగా డేటా సేకరించేందుకు హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక కమిషన్ ఏర్పాటు చేస్తామని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు తెలిపారు. కేబినెట్ నిర్ణయాలను మంత్రి మీడియాకు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్రంలో చర్చలు సాగుతున్నాయని, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో వర్గీకర ణకు మంత్రి వర్గ ఆమోదం తెలిపిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే కమిషన్ నుంచి నివేదిక అందాక తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. మూడు నెలల్లోగా సదరు కమిషన్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందని అన్నారు.




# పేదల ఆత్మగౌరవాన్ని నిలబెడతాం

## వారి సొంతింటి కలను సాకారం చేస్తాం

## ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్‌ను ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ఆత్మగౌరవంతో బతకాలనేది పేదల కల అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "రోటీ కపడా ఔర్ మకాన్ అనేది ఇందిరమ్మ నినాదం. ఇల్లు, వ్యవసాయ భూమిని ప్రజలు ఆత్మగౌరవంగా భావిస్తారు. అందుకే ఇందిరాగాంధీ దశాబ్దాల క్రితమే ఇళ్లు, భూపంపిణీ పథకాలను ప్రారంభించారు. దేశంలో గుడి లేని ఊరు ఉండొచ్చు కానీ.. ఇందిరమ్మ కాలనీ లేని ఊరు లేదు. రూ.10 వేలతో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల పథకం నేడు రూ.5 లక్షలకు చేరుకుంది. ఇంటి నిర్మాణానికి ప్రతి పేదవాడికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తున్నాం. అర్హులైన వారికే ప్రభుత్వ ఇల్లు చెందాలనేది మా లక్ష్యం. తొలి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతిపక్ష నేత సీటు ఖాళీగా ఉండటం రాష్ట్రానికి మంచిది కాదు అనంతరం భారాస అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి రేవంత్ పలు వ్యాఖ్యలు చేశారు. ప్రధాన ప్రతిపక్ష నేత సీటు అసెంబ్లీలో ఖాళీగా ఉండటం రాష్ట్రానికి మంచిది కాదన్నారు. అసెంబ్లీకి కేసీఆర్ వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. రాష్ట్రంలో అధికార, విపక్షాలు అంటే భారత్-పాకిస్థాన్ తరహాలో పరిస్థితిని ఎందుకు మార్చారని ప్రశ్నించారు.

"ఎవరినో నిందించుకుంటూ కాలం గడపకుండా సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నాం. దీనికి ప్రతిపక్షాలు కొంత సమయం ఇచ్చి సహకరించాలి. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రిప్రజెంటేషన్ ఇచ్చి సమస్యలపై చర్చించేవారు. ఆ తర్వాత వైఎస్‌ఆర్ సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు కూడా అదే తరహాలో ప్రభుత్వానికి సూచనలు చేసేవారు. లోపాలను సరిదిద్దుకోవాలని చెప్పేవారు.

**ఇప్పటికైనా మీ ఆలోచనా విధానం మారాలి...** ఉమ్మడి రాష్ట్రంలో మంచి సంప్రదాయం ఉండేది. సభలో కొన్ని అంశాలను చర్చించి.. ఆ తర్వాత ప్రజల సమస్యలపై ప్రత్యక్షంగా అప్పటి మంత్రులను కలిసేవాళ్లం.. నిధులు రాబట్టుకునేవాళ్లం. గత పదేళ్లు ఆ అవకాశం కల్పించలేదు.. సచివాలయానికే రాలేదు. పదేళ్లు మీరేం చేశారని మేం అడగటం లేదు. ప్రజలు అన్నీ గమనించే భారాసను అధికారానికి దూరం చేశారు. ఇప్పటికైనా మీ ఆలోచనా విధానంలో మార్పు రావాలి. మీ విధానమేంటి? ఆలోచనేంటి? ఈ ప్రభుత్వమే నడవొద్దా?ప్రజలకు సంక్షేమం చేపట్టొద్దా?రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లాల్సిన అవసరం లేదా? మీరు సభకే రావడం లేదు.

దీన్ని రాష్ట్ర ప్రజలు ఏవిధంగా అర్థం చేసుకోవాలి? మీ అనుభవం, చతురతను ఉపయోగించి పాలకపక్షానికి సూచనలు చేయండి. ఏ సూచనా చేయకుండా అడ్డుకుంటామనే విధానంలో ఉండటం తెలంగాణకు మంచిదా? మీ పార్టీ నేతలు తెలియక ఏదైనా అన్నప్పుడు ఇది మంచి పద్ధతి కాదని చెప్పాలి కదా! మీ పిల్లలిద్దరినీ మాపైకి ఉసిగొల్పి ఎందుకిలా చేస్తున్నారు?ఎందుకు పెద్దరికం నిలబెట్టుకోవడం లేదు?" అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో ప్రజాపాలన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీఎం తెలిపారు. సచివాలయ ప్రాంగణం, నెక్లెస్‌రోడ్డులో వేడుకలు నిర్వహిస్తామన్నారు. 3 రోజుల పాటు పండగ వాతావరణంలో ఇవి జరుగుతాయని.. ఈ వేడుకలకు విపక్ష నేతలనూ ఆహ్వానిస్తామని చెప్పారు.

"కేసీఆర్, బండి సంజయ్‌లకు ఆహ్వానాలు పంపిస్తాం. ప్రజలు, నాయకులు ఈ ఉత్సవాల్లో పాల్గొనాలి. ఈనెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తాం. దీనికి సంబంధించిన సూచనలు ఏమైనా ఉంటే అక్కడ చెప్పాలి"అని రేవంత్ సూచించారు.

## కాంగ్రెస్ గూటికి సోయం బాబూరావు, ఆత్రం సక్కు

హైదరాబాద్ : బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు షాక్ ఇచ్చారు ఆ పార్టీ నేతలు. ఇరు పార్టీలకు చెందిన ఇద్దరు కీలక నేతలు గురువారం నాడు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ నేత, మాజీ ఎంపీ సోయం బాబురావు, బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. గాంధీ భవన్‌లో పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో వీరిద్దరూ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు మహేష్ గౌడ్. ఈ సందర్భంగా తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. చేరికల అంశంపై హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో చేరుతామంటూ సంప్రదింపులు చేస్తున్నారని తెలిపారు. శుభ ముహూర్తం చూసుకుని కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వస్తారని మహేష్ గౌడ్ చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకం అని చెప్పిన ఆయన.. కేసీఆర్ ప్రభుత్వం చేసిన ఫిరాయింపులకు, ఇప్పటి ఫిరాయింపులకు తేడా ఉందన్నారు. నాడు కేసీఆర్‌కి పూర్తి మెజార్టీ ఇచ్చినా ఫిరాయింపులు చేశారని విమర్శించారు. ప్రభుత్వాన్ని పడగొడుతాం అంటే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వచ్చారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలన పట్ల ఆకర్షితులవుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు.. తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఇదే సమయంలో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నాయకుడు హరీష్ రావు అరెస్ట్‌పై మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటామంటే కుదరని చెప్పారు.

తాము ఎన్నో సార్లు గృహ నిర్బంధాలకు గురయ్యామన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో నిర్బంధం ఎలా ఉండేదో హరీష్ రావు గుర్తు చేసుకోవాలని సూచించారు. అడ్డమైన బాష మాట్లాడుతాం.. అధికారులను తిడుతామంటే చట్టం తన పని తాను చేసుకొని పోతుందన్నారాయన. నిరసన తెలిపే హక్కును అడ్డుకోబోమన్నారు. హరీష్ రావు నానా యాగీ చేయాల్సిన అవసరం ఏముందని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. కేసీఆర్ ఇప్పటికైనా ఆ పార్టీ అల్లరి మూకలను కంట్రోల్ చేయాలని హితవు చెప్పారు. లేదంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.




**సోయం బాబురావు, ఆత్రం సక్కు కామెంట్స్..** ఈ సందర్భంగా సోయం బాబురావు మాట్లాడుతూ కీలక కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నచ్చి పార్టీలో చేరినట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి తన అభిమాన నాయకుడు అని చెప్పారు. పదేళ్లలో పరిష్కారం కాని సమస్యలన్నింటినీ రేవంత్ రెడ్డి పరిష్కరిస్తున్నారని చెప్పారు. ఉద్యమ సమయంలో కాంగ్రెస్ పార్టీపై తాను చేసిన విమర్శలకు చింతిస్తున్నానని బాబురావు ప్రకటించారు. ఇక ఆత్రం సక్కు మాట్లాడుతూ.. ఆదివాసీల సంరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. మైదాన ప్రాంతంతో పాటు.. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుందని, అందుకే పార్టీలోకి చేరుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలను గడపగడపకి తీసుకెళ్తానని చెప్పారు.

## హైదరాబాద్ అలా కాకూడదనే స్క్రాప్ పాలసీ తీసుకొచ్చాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రానున్న రెండేళ్లలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకొస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నగరంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో నిర్వహించిన సభలో సీఎం ప్రసంగించారు. హైదరాబాద్




నిర్మానుష్యంగా మారకుండా ఉండేందుకే స్క్రాప్ పాలసీ తీసుకొచ్చినట్లు చెప్పారు. అందులో భాగంగానే ఈవీలకు రిజిస్ట్రేషన్, ట్యాక్స్ ఫ్రీ చేశామన్నారు. ఆరు గ్యారంటీలకు బస్సు డ్రైవర్లు, కండక్టర్లు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్నారని.. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ ఇప్పుడు లాభాల్లో నడుస్తోందన్నారు. మూసీ ప్రక్షాళన జరగాలంటే ప్రజలు సహకరించాలని కోరారు. కోర్టు కేసుల చిక్కుముడులు విప్పి 55,143 ఉద్యోగాలు ఇచ్చామని ఈ సందర్భంగా సీఎం వెల్లడించారు.

# 'ఇది కదా శుభవార్త అంటే'

## భారీగా తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు..

## ట్యాక్స్ తగ్గించిన కేంద్రం!



దేశప్రజలకు భారీ శుభవార్త చెప్పింది కేంద్ర ప్రభుత్వం. సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయంతో త్వరలోనే డీజీల్, పెట్రోల్ ధరలు భారీగా తగ్గనున్నాయి. దీంతో వాహనదారులు పండగ చేసుకుంటారు. పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై ప్రభుత్వం ఊహించని విధంగా పన్నును తొలగించింది. అనేక నెలల చర్చల తర్వాత ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్, ముడి చమురు ఉత్పత్తులు, పెట్రోల్, డీజిల్ ఉత్పత్తులపై భారీగా పన్నును తగ్గించింది ప్రభుత్వం. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య రిలయన్స్, ONGC వంటి చమురు ఎగుమతి కంపెనీలకు ఉపశమనం కలిగిస్తుంది. ఈ నిర్ణయం వారి స్థూల రిఫైనింగ్ మార్జిన్‌ను పెంచవచ్చు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 2022 జులై 1 నుంచి కేంద్రం పెట్రోల్, డీజీల్, ఏవీయేషన్ టర్బైన్ ఫ్యూయల్ , క్రూడ్ ఆయిల్ ఉత్పత్తుల ఎగుమతులపై విండ్ ఫాల్ టాక్స్ ను అమలు చేసింది. అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరిగి, కంపెనీలకు అధిక లాభాలు వస్తుండటంతో ఈ ట్యాక్స్ అమలు చేయడం ప్రారంభించారు. రెండు వారాల సగటు చమురు ధరల కారణంగా ఈ ట్యాక్స్ రేట్లు ప్రతి 15రోజులకు సవరించేవారు. ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్ కు 72 నుంచి 75 మధ్య ట్రేడ్ అవుతుండగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ తగ్గుదల దృష్ట్యా కేంద్రం విండ్ పాల్ ట్యాక్స్ ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అంతేకాదు పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై విధిస్తున్న రోడ్డు, ఇన్ ఫ్రాస్ట్రక్చర సెస్ ను కూడా తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం తర్వాత, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు గ్రీన్‌లో రూ.1,300.05 వద్ద ట్రేడవుతున్నాయి. ఇది కాకుండా, పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై ప్రభుత్వం రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్‌ని కూడా ఉపసంహరించుకుంది. దీనికి సంబంధించి పార్లమెంట్‌లో నోటిఫికేషన్ కూడా ఇచ్చారు. సెప్టెంబర్‌లో, భారత ప్రభుత్వం ఆగస్టులో టన్నుకు రూ. 1,850 నుండి ముడి చమురుపై విండ్‌ఫాల్ పన్నును తొలగిస్తున్నట్లు ప్రకటించింది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఇంధనం ఎగుమతులపై విండ్ ఫాల్ పన్నులు కూడా తొలగించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, క్రెమ్లిన్‌పై పాశ్చాత్య ఆంక్షల ప్రారంభంలో, ముడి చమురు ధరల పెరుగుదల చమురు కంపెనీలకు భారీ లాభాలకు దారితీసింది. ఈ లాభాలు చమురు కంపెనీలు పెద్ద మొత్తంలో లాభాలు ఆర్జించే వాతావరణాన్ని సృష్టించాయి.

ఈ అసాధారణ లాభాల దృష్ట్యా, దేశీయ ముడి చమురు ఉత్పత్తిదారులు, ఎగుమతిదారులపై విండ్‌ఫాల్ పన్ను విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేశీయ ముడి చమురు ఉత్పత్తిదారులు, ఎగుమతిదారులపై విండ్‌ఫాల్ పన్ను విధించడం ద్వారా ప్రభుత్వానికి అదనపు ఆదాయాన్ని ఆర్జించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

# సంపాదకీయం

## ఒకప్పటి పంజాబ్ 'ఫస్ట్ ఫ్యామిలీ' మెంబర్ నేడు 'తంఖయ్య'గా ఎందుకు?

దేవాలయంలో శిక్ష అనుభవిస్తున్న పంజాబ్ డిప్యూటీ సీఎం సుఖ్ బీర్ సింగ్ బాదల్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. స్వర్ణదేవాలయ ప్రాంగణంలోనే ఆయనపై తుపాకీ కాల్పులు జరగడం సంచలనంగా మారింది. దీంతో.. ఒకప్పుడు పంజాబ్ లో 'ఫస్ట్ ఫ్యామిలీ'గా చలామణి అయిన ఫ్యామిలీకి చెందిన వ్యక్తికి నేడు ఈ పరిస్థితి ఏంటనే చర్చ తెరపైకి వచ్చింది. అవును... సిక్కుల ప్రయోజనాల కోసం పనిచేసే శిరోమణి అకాలీదళ్ పార్టీ సుఖ్ బీర్ సింగ్ బాదల్ ను అధ్యక్ష పదవిని వీడమని అనడం, సిక్కులకు ద్రోహం చేసిన వ్యక్తిగా ఆయనను ప్రకటించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ సమయంలో బాదల్ కుటుంబం ఎలా ఉండేది, ఇప్పుడు ఇలాంటి పరిస్థితి ఎందుకు వచ్చిందనేది ఆసక్తిగా మారింది. సుఖ్ బీర్ సింగ్ తండ్రి ప్రకాశ్ సింగ్ బాదల్ 1947లో పంజాబ్ రాజకీయాల్లోకి బ్లాక్ సమితి ఛైర్మన్ గా అడుగుపెట్టారు. ఆ తర్వాత పదేళ్లలోనే అకాలీదళ్ నుంచి రాష్ట్ర విధాన సభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1970లో తొలిసారి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నారు. ఈ క్రమంలో... 1977-2017 మధ్య నాలుగు సార్లు సీఎం అయ్యారు. ఈ సమయంలో పంజాబ్ పై బాదల్ ఫ్యామిలీ బలమైన పట్టు సంపాదించింది. ఫలితంగా... తరచూ మీడియా ఈ ఫ్యామిలీని "పంజాబ్ ఫస్ట్ ఫ్యామిలీ"గా అభివర్ణించేది. ప్రకాశ్ సింగ్ బాదల్ కు కుమారుడు సుఖ్ బీర్ సింగ్ తో పాటు కుమార్తె ప్రణీత్ కౌర్ కైరాన్ ఉన్నారు. ఆమెతో పాటు, ఆమె భర్త ప్రతాత్ సింగ్ కూడా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. ఇక 2008లో 45 ఏళ్ల వయసులో అకాలీదళ్ పార్టీ పగ్గాలు అందుకున్న సుఖ్ బీర్ సింగ్ కేంద్రమంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ఎంపీగా పని చేయగా.. ఆయన భార్య హర్ సిమ్రత్ కౌర్ కూడా కేంద్రమంత్రిగా పని చేశారు. ఈ క్రమంలో... ఖలిస్థానీ మద్దతుదారు సంస్థ బబ్బర్ ఖల్సాకు చెందిన నరైన్ చౌరా అనే మిలిటెంట్ సుఖ్ బీర్ పై హత్యాయత్నం చేశాడు. వాస్తవానికి పంజాబ్ లో అకాలీదళ్ పట్టును సడలించేందుకు ఖలిస్థాన్ ఉద్యమం తెరపైకి వచ్చిందని.. అప్పటి నుంచి బాద కుటుంబానికి ఇబ్బందికరంగా తయారయ్యిందని అంటారు.

**ఇప్పుడు తంఖయ్యగా!:** అలా పంజాబ్ ఫస్ట్ ఫ్యామిలీ గా చలామణి అయిన బాదల్ కుటుంబానికి చెందిన సుఖ్ బీర్ ను సిక్కుల అత్యున్నత స్థానమైన శ్రీఅకాల్ తక్త్ సాహెబ్.. డిసెంబర్ 2న సుఖ్ బీర్ ను తంఖయ్య (సిక్కులకు ద్రోహం చేసిన వ్యక్తి)గా ప్రకటించింది. మతపరమైన దుష్ప్రవర్తనకు పాల్పడినందుకే ఈ శిక్ష అని అంటున్నారు. ఇందులో భాగంగా... ఆయనతో పాటు అమ్రో 12 మంది అకాలీదళ్ నేతలు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అమృత్ సర్ లోని స్వర్ణదేవాలయం ప్రాంగణంలో రెండు రోజుల పాటు ఊడ్చడం, గిన్నెలు తోమడం, వాష్ రూమ్ లను శుభ్రం చేయడం వంటి పనులు చేయాలని ఆదేశించింది.

## అప్రమత్తంగా ఉంటూ విద్యలో ఉన్నత శిఖరాలకు ఎదగాలి : డి ఐ ఇన్స్పెక్టర్ గంగాధర్




శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉంటూ విద్యార్థినీలు విద్యలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని శామీర్ పేట పోలీస్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ గంగాధర్ తెలిపారు.

సైబరా బాద్ కమిషనర్ ఆదేశాల మేరకు శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ గంగాధర్ మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, యాంటీ ర్యాగింగ్ లపై శామీర్ పేట(జగద్గిరిగుట్ట)లోని తెలంగాణ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థినిలు అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలు, యాంటీ ర్యాగింగ్లతో విద్యా ర్థుల జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. సెల్ఫోన్లో జరిగే పలు సైబర్ మోసాలపై విద్యార్థులకు వివరిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. సైబర్ నేరాలపై విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్రవంతి, సబ్ఇన్స్పెక్టర్ హారిక, కానిస్టేబుల్స్ సుధ మాధవి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూమిలో సారవంతం పెరగాలంటే సేంద్రీయ ఎరువులని వాడాలి



శామీర్ పేట, (గరుడ వార్త) : రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులనే వినియోగించాలని శామీర్ పేట మండల వ్యవసాయాధికారి రమేష్, మూడుచింతలపల్లి మండల వ్యవసాయ అధికారి రవి కుమార్ లు రైతులకు సూచించారు. గురువారం మండల కేంద్రాలలోని రైతు వేదికల లో నిర్వహించిన ప్రపంచ మృత్తిక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న భూతాపం, వాతావరణ మార్పులకు ప్రస్తుత వ్యవసాయ విధానం ప్రధాన పాత్ర పోషిస్తూందని తెలిపారు. %p% వీటిని ఎదుర్కొనే ధీటైన పరిష్కారం స్వదేశీ పరిజ్ఞానంతో తక్కువ పెట్టుబడుల తో సేంద్రియ వ్యవసాయం ఒక్కటే మార్గమన్నారు. రైతులు ఒకే రకమైన పంటలు వేయకుండా సమగ్ర వ్యవసాయ విధానాలను పాటిస్తూ అధిక దిగుబడులను సాధించాలని సూచించారు. నేల సారవంతం తగ్గడానికి గల కారణాలు, నేల ఆరోగ్య పరిరక్షణకు పాటించవలసిన పద్ధతులను రైతులకు తెలియజేస్తూ పలు సూచనలు సలహాలు అందజేశారు. సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటిస్తూ భూసారాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కాస్మొటిక్ కిట్లు రాలే!




జగిత్యాల : పేద కుటుంబాలకు చెందిన బాలబాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఏర్పాటు చేసిన మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు సమస్యలకు నిలయంగా మారాయి. ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.20 లక్షల వరకు వెచ్చిస్తున్నా తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. అద్దె భవనాల్లో పూర్తిస్థాయిలో వసతులు లేకపోగా కనీసం నిత్యావసరాల విషయంలో నిర్లక్ష్యంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

**బాలురు 928... బాలికలు 771**

జిల్లాలో 5 మైనారిటీ గురుకుల పాఠశాలలు, అనుబంధంగా జూనియర్ కళాశాలలు ఉన్నాయి. జగిత్యాలలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో 349 మంది, జగిత్యాల బాలికల గురుకుల పాఠశాలలో 404 మంది, కోరుట్లలో 281, మెట్పల్లిలో 298, ధర్మపురిలో 367 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో బాలురు 928 మంది, బాలికలు 771 మంది విద్యనభ్యసిస్తున్నారు. మైనారిటీ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి ప్రతి 3 నెలలకు ఒకసారి కాస్మొటిక్ కిట్లను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఇందులో 2 దువ్వెనలు, 1 టూత్ బ్రష్, టూత్ పేస్టులు చిన్నవి 3, కొబ్బరి నూనె బాటిల్, ఫేస్ పౌడర్ చిన్నవి 3, స్నానపు సబ్బులు, బట్టల సబ్బు 1 ఉంటాయి. ప్రత్యేకంగా దోబీ గురుకులానికి వచ్చి దుస్తులు ఉతకడంతో ఒక సబ్బు 3 నెలలకు సరిపడుతుండగా, స్నానపు సబ్బు ఒక్కరికి 15 రోజులకు కూడా సరిపడటం లేదు. అయితే 3 నెలలకు ఒకసారి సరఫరా చేసే కాస్మొటిక్ కిట్లు ఏడాదిన్నర నుంచి రావడం లేదు. గతేడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో కిట్లు సరఫరా కాగా ఆ తరువాత నుంచి కాస్మొటిక్ కిట్ల ఊసే లేకుండా పోయింది.

**మైదానాలు ఎక్కడ?**

విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి, ఆరోగ్యం, సోదరభావం, ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా మైనారిటీ గురుకుల పాఠశాలల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు సరఫరా చేస్తోంది. ఇందులో క్రీడా పరికరాలతో పాటు, బూట్లు, సాక్సులు, సమదుస్తులు అందచేస్తోంది. ప్రతి పాఠశాలలోనూ వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, అద్దె భవనాల్లో గురుకులాలు నిర్వహిస్తుండటంతో మైదానాలు మాత్రం అందుబాటులో లేవు. దీంతో సెలవు దినాల్లో మైదానానికి తీసుకెళ్లి ఆటలు ఆడించాల్సిన పరిస్థితి నెలకొంది.

**ప్రభుత్వానికి నివేదించాం**

**డాక్టర్ రాజేందర్, ఆర్ఎల్సీ**

కాస్మొటిక్ కిట్లు సరఫరా కాని విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. స్టడీ మెటిరీయల్, స్పోర్ట్స్ కిట్లు ఇప్పటికే సరఫరా కాగా విద్యార్థులకు పంపిణీ చేశాం. కాస్మొటిక్ కిట్లు, బాలికల అవసరాలకు సంబంధించినవి కూడా సరఫరా కాగానే విద్యార్థులకు అందచేస్తాం.

**విద్యార్థినులకు ఇబ్బందులు**

కాస్మొటిక్ కిట్లతో పాటు బాలికలకు ప్యాడ్లు సైతం సరఫరా చేయడం లేదు. దీంతో ప్రతి నెలా విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా అనారోగ్యం బారిన పడే అవకాశాలకు తావిస్తోంది. ప్రతి పాఠశాల, కళాశాలలో చదువుతున్న కిషోర బాలికలకు ప్యాడ్లు గతంలో క్రమం తప్పకుండా 3 నెలలకు ఒకసారి వచ్చేవి. ఇందులో ఒక్కో ప్యాకెట్లో 3 ప్యాడ్లు ఉంటుండగా, మూడు నెలలు సరిపోయేవి. ఈ ఏడాది ప్రత్యేకంగా చిత్రలేఖనం కోసం కిట్లు సరఫరా చేసిన ప్రభుత్వం, ప్యాడ్లు పంపిణీ చేయకపోవడం విస్మయం కలిగిస్తోంది.

## రొమ్ము రుగ్మత.. ఏదీ సన్నద్ధత

ఖమ్మం : ఏటా అక్టోబరు మాసంలో రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం నిర్వహిస్తారు. మహిళల్లో పెరుగుతున్న బ్రెస్ట్ క్యాన్సర్‌పై జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ రుగ్మతను ముందస్తుగా గుర్తించడం ఎలా, ఏయే వైద్య పరీక్షలు ఉన్నాయి, వాటి ప్రాధాన్యం, సొంతంగా ఎలా పరీక్షించుకోవచ్చు వంటి విషయాలపై మహిళల్లో అవగాహన పెంచాలి. నెలాఖరు వచ్చినా జిల్లాలో ఇటువంటి కార్యక్రమాలు జరిగిన జాడ లేదు.

ప్రధాన సమస్యలు ఇవీ...మహిళల్లో వివిధ రకాల రొమ్ము రుగ్మతలు బయట పడుతున్నాయి. సాధారణ లక్షణాలతో ప్రాణాంతక వ్యాధులకు దారి తీస్తున్నాయి. చాలా రకాలు ఉన్నప్పటికీ బ్రెస్ట్ క్యాన్సర్, సిస్టులా, ఇన్‌ఫెక్షన్లు, గడ్డలు ప్రధానమైనవి. ఆయా సమస్యల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధిగా వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలో ఈ సమస్య అధికంగా ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. పట్టణ, పల్లె ప్రాంతాల్లో కేసులు విస్తరిస్తున్నాయి. జిల్లాలోనూ ఏటా కొత్త కేసులు నమోదవుతున్నాయి. ముందస్తు స్క్రీనింగ్‌తో వ్యాధి ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది. ఏటా ఆరోగ్య శాఖ అక్టోబరును బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన మాసంగా ప్రకటించి కార్యక్రమాలు చేపడుతోంది. జిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వ యంత్రాంగం అంతగా శ్రద్ధ చూపకపోవడంతో ప్రజల్లో అవగాహన కొరవడింది.

కొరవడిన ప్రణాళిక అక్టోబరు చివరి వారం వచ్చినా ఆరోగ్యశాఖ అవగాహన కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. ముందస్తు ప్రణాళికలు రూపొందించడంలో యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే విమర్శలు ఉన్నాయి. ఈ మాసంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా బ్రెస్ట్ క్యాన్సర్‌పై చర్చించడం, రక్త నమూనాలు సేకరించడం, మామోగ్రామ్ పరీక్షలు చేయడం, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం, ప్రదర్శనలు, అవగాహన ర్యాలీలు నిర్వహించడం, వివిధ రూపాల్లో విస్తృత ప్రచారం కల్పించడం వంటివి చేయాలి. జిల్లాలో బోధనాసుపత్రి, ఏడు సీహెచ్‌సీలు, 30 పీహెచ్‌సీలు, 161 పల్లె దవాఖాలు ఉన్నాయి. తొమ్మిది బస్తీ దవాఖానాలు, ఆరవైఆరు ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నప్పటికీ కార్యక్రమాల నిర్వహణ నామమాత్రంగానూ జరగలేదు. ఈనెల 22న అవగాహనకు ప్రతీకగా పింక్ రిబ్బన్ డే నిర్వహించాల్సి ఉండగా ఎక్కడ కార్యక్రమాలు చేయలేదు. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుబ్బారావును వివరణ కోరగా ఆరోగ్యశాఖ తరపున అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదని, స్వచ్ఛంద సంస్థ సమన్వయంతో నిర్వహించాలని ఇటీవలే నిర్ణయించినట్లు తెలిపారు. అన్ని ఆస్పత్రుల్లో కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

## ఈ-వాహన ఛార్జింగ్ కేంద్రాలు

సంగారెడ్డి : పెట్రో, డీజిల్ ధరలు తరచూ పెరుగుతున్నాయి. వాహనదారులకు ఇది భారంగా మారింది. దీంతో ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి కనబర్చుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వాహనాలు కొనుగోలు చేస్తున్న పలువురు ఇంటి వద్ద ఛార్జింగ్ చేసుకుంటున్నారు. రానున్న రోజుల్లో ఆ ఇబ్బందులు తీరనున్నాయి. టీఎస్‌రెడ్‌కో (తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తుండటమే దీనికి కారణం.

ప్రభుత్వ స్థలాలకు ప్రాధాన్యం: టీఎస్‌రెడ్‌కో ఆధ్వర్యంలో ఈ-వాహన ఛార్జింగ్ కేంద్రాలను జిల్లాల్లో అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా యంత్రాంగం అడుగులు వేస్తోంది. ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఛార్జింగ్ స్టేషన్లకు ఇప్పటికే స్థల పరిశీలన పూర్తి చేశారు. జాతీయ, ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాల్లో స్థాపించనున్నారు. రెవెన్యూ, పౌరసరఫరాలు, ఆర్అండ్‌బీ, ఆర్టీసీ, పంచాయతీరాజ్, సహకార, సంక్షేమ శాఖల సహకారంతో ఆయా శాఖల పరిధిలో స్థలాలను గుర్తిస్తున్నారు. జిల్లాలో ఆర్అండ్‌బీకి చెందిన ఏడు స్థలాలను ఇప్పటికే ఖరారు చేశారు. కోహీర్‌లోని హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలోనూ ఏర్పాటుకు నిర్ణయించారు. హోటళ్లు, దాబాల నిర్వాహకులు ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చేలా ప్రయత్నిస్తున్నారు.

**స్థల యజమానులకు ఆదాయం**

ఛార్జింగ్ కేంద్రాల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయంలో స్థలాలకు సంబంధించిన శాఖలు లేదా యజమానులకు కొంత మేర చెల్లించనున్నారు. ఒక్కో యూనిట్‌కు రూపాయి చొప్పున చెల్లించనున్నారు. రాబోయే మూడు నెలల్లో కేంద్రాలు అందుబాటులోకి తెచ్చేందుకు సంబంధిత విభాగం అధికారులు ప్రయత్నిస్తున్నారు. ద్విచక్ర వాహనాల్లో 3 నుంచి 4 యూనిట్లు, కారులో 75 యూనిట్ల వరకు ఛార్జింగ్ చేసే అవకాశం ఉండనుంది. బ్యాటరీ సామర్థ్యం ఆధారంగా అరగంట నుంచి గంటలోపు ఛార్జింగ్ చేయనున్నారు. ఆయా చోట్ల అనుమతులు పూర్తయితే 30 కిలోవాట్స్, 60 కిలోవాట్స్ సామర్థ్యంతో కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.

**త్వరలో వినియోగంలోకి వచ్చేలా..**

రాబోయే రోజుల్లో విద్యుత్తు వాహనాలు భారీగా పెరగనున్నాయి. ఇందుకు అనుగుణంగా ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలో ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేస్తాం. ఈ-వాహన ఛార్జింగ్ కేంద్రాలు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.మాణిక్యం, టీఎస్ రెడ్‌కో జిల్లా మేనేజర్

## ఇక కల్యాణ వైభోగమే!

వికారాబాద్ : దీపావళి పండగ ముగియగానే పెళ్లిళ్ల సీజన్ మొదలు కానుంది. ఇందుకు వివాహ వేడుక వేదికలు సిద్ధమవుతున్నాయి. మూడు నెలలుగా మూడాలు శుభకార్యాలకు అడ్డంకిగా ఉన్నాయి. ఇక ఇప్పటి నుంచి మొదలై రెండు నెలల పాటు మంచి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. దీంతో నిర్వాహకులు ఇప్పటి నుంచే మంచి ముహూర్తం నిర్ణయించుకునేందుకు పురోహితులను ఆశ్రయిస్తున్నారు. రెండు నెలల పాటు వాయిద్యాలు, మండపాలు, క్యాటరింగ్ నిర్వాహకులకు చేతి నిండా పనులు దొరకనున్నాయి. అడ్వాన్సు చెల్లించి ఫంక్షన్ హాళ్లను బుక్ చేసుకుంటున్నారు.

**వసతులను బట్టి..**

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సుమారు వెయ్యికి పైగా ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. వసతులను బట్టి ఒక్క రోజు అద్దె రూ.70 వేల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తారు. పెళ్లిళ్ల సీజన్ మొదలు కానుండటంతో వాటి ధరలు అమాంతం పెంచేశారు. దీపావళి కూడా కావడంతో వస్త్ర, బంగారు దుకాణాలు కొనుగోళ్లతో సందడిగా ఉన్నాయి. ఇదే ఒరవడి రెండు నెలల పాటు ఉండనుంది. నాలుగు జిల్లాల్లోని సిద్దిపేట, గజ్వేల్, మెదక్, సంగారెడ్డి, జహీరాబాద్, వికారాబాద్, తాండూరుల్లోని దుకాణాల్లో రద్దీ పెరగనుంది. దీనికితోడు ఇక్కడినుంచి మరికొందరు హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేయనున్నారు.

# యథేచ్ఛగా కల్తీ దందా

హైదరాబాద్: ఘాటు వాసన వచ్చేందుకు సిట్రిక్ యాసిడ్‌తో అల్లం పేస్టు.. తెల్లగా, చిక్కగా కనిపించేందుకు ఎసిటిక్ యాసిడ్‌తో పాలు.. కుళ్లిన మాంసం కొవ్వుతో వంటనూనె, నెయ్యి..ఇదీ నగరంలో కల్తీ ఆహార పదార్థాల తయారీ కోసం కొందరు నేరగాళ్లు చేస్తున్న దారుణాలు. ఇలాంటివి ఆహార భద్రతా విభాగం, టాస్క్‌ఫోర్స్, ఎస్‌వోటీ పోలీసుల తనిఖీల్లో వెలుగుచూస్తున్నా పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడక పోవడానికి కారణం కోరల్లేని చట్టాలే. నిందితులపై పోలీసులు కేసులు నమోదుచేస్తున్నా.. కఠిన శిక్షలుండటం లేదు. ఇదే అవకాశంగా నగరంలో కల్తీదందాను కొందరు కొనసాగిస్తున్నారు.



**అలా కేసులు.. ఇలా బయటకు..**

నగరంలో కల్తీ ఆహారం ఎక్కడ పట్టుబడ్డా భారతీయ న్యాయ సంహితలోని 274, 275 తదితర సెక్షన్ల కింద కేసులు నమోదుచేస్తున్నారు. ఈ సెక్షన్ల ప్రకారం ఆరునెలల జైలుశిక్ష, లేదా రూ.5వేల జరిమానా లేదా రెండూ విధించే అవకాశముంది. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించే అవకాశముండదు. కల్తీ దందాతో రూ.కోట్లు ఆర్జిస్తున్న కేటుగాళ్లపై ఇలాంటి సాధారణ సెక్షన్ల ప్రయోగంతో వారిలో భయంఉండటంలేదు. ఉదాహరణకు సౌత్ వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కిన నిందితుడు ఇమ్రాన్ సలీమ్ గతంలో కల్తీ పదార్థాల తయారీతో మూడుసార్లు చిక్కాడు. అయినా భయం లేకుండా నాలుగోసారి చీకటి దందా చేస్తూ పట్టుబడ్డాడు.

**తూతూమంత్రంగా తనిఖీలు**

ఆహార కల్తీ నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రత, ప్రమాణాల చట్టం– 2006ను తీసుకొచ్చింది. ఆహార భద్రతా విభాగం ఈ చట్టం అమలును పర్యవేక్షించాల్సి ఉన్నా పూర్తిస్థాయిలో జరగడం లేదు. కొన్నిసార్లు ఫలానా ప్రాంతంలో ఆహార ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు సమాచారం అందుకుని పోలీసులు సోదాలు చేస్తున్నారు. తర్వాతే ఆహార భద్రతా విభాగం అధికారులు అక్కడకు చేరుకుంటున్నారు. వారు నిత్యం తనిఖీలు చేయాల్సి ఉన్నా ఆ దిశగా దృష్టి సారించక పోవడం ఓ సమస్యగా మారుతోంది

# రోగాలు తగ్గిస్తామంటూ తప్పుడు ప్రకటనలు.. డీసీఏ ఝలక్

హైదరాబాద్: కిడ్నీల్లో రాళ్లున్నాయా.. ఈ మందు తీసుకుంటే రాళ్లన్నీ మటుమాయం.. మధుమేహంతో బాధపడుతున్నారా.. ఈ గోలీలు వేసుకుంటే తగ్గిపోతుంది.. ఈ లేహ్యం తీసుకుంటే క్యాన్సర్ పూర్తిగా తగ్గిపోతుంది.. ఇలా రకరకాల ప్రకటనలతో రోగులను తప్పుతోవ పట్టిస్తున్న అక్రమార్కులకు ఔషధ నియంత్రణ శాఖ (డీసీఏ) ఝలక్ ఇచ్చింది. ఇలాంటి తప్పుడు ప్రకటనలిస్తున్న వారిపై 176 కేసులు నమోదు చేసింది. రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారి ఆటకట్టించింది. ఇవేకాకుండా పలు రకాల అంశాలకు సంబంధించి మొత్తం 494 కేసులు నమోదు చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలతోపాటు ఇతర ప్రాంతాల్లో సైతం దాడులు జరిపింది. వివరాలను ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి సోమవారం వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న



మందుల విలువ రూ.3.06 కోట్లు ఉంటుందన్నారు. చాలామంది డీసీఏ నుంచి అనుమతులు తీసుకోకుండానే ఔషధ దుకాణాలు నిర్వహిస్తున్నారు. కొందరు ఆర్‌ఎంపీల పేరుతో వైద్య సేవలు అందిస్తూ మందుల నిల్వలు పెట్టుకుంటున్నారు. కొందరైతే అనుమతులు లేకుండానే మందులను సైతం తయారు చేసి అడ్డదారుల్లో సరఫరా చేస్తున్నట్లు డీసీఏ గుర్తించింది.

ప్రధాన కేసుల సంఖ్య..

నకిలీ మందుల విక్రయాలు–8
అధిక ధరలకు అమ్మకాలు– 75
మందులపై తప్పుడు ప్రకటనలు– 176
అనుమతుల్లేకుండా విక్రయాలు–61
మందుల అక్రమ నిల్వ– 124
అనుమతులు లేకుండా మందుల తయారీ– 41
లైసెన్స్ లేకుండా కాస్మోటిక్స్ తయారీ– 5
ఇతర కేసులు– 4

# ఉపాధికి వస్తే.. ఊపిరి పాయె

చేవెళ్ల : రైల్వే ఉద్యోగ నియామక పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తూ కుటుంబానికి తోడుగా ఉంటున్న వారొకరు.. పొలంలో కూరగాయల్ని విక్రయించి కుటుంబాన్ని పోషించేవారు మరొకరు. కూరగాయల్ని కొనుగోలు చేద్దామని ఆగినవారు ఇంకొకరు.. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం. రెప్పపాటులో జరిగిన ప్రమాదం ఈ నలుగుర్నీ బలితీసుకుంది. 4 కుటుంబాలకు శోకాన్ని మిగిల్చింది. చేవెళ్ల మండలం ఆలూరు స్టేజ్ దగ్గర సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబ సభ్యులు విలపించడం అందర్నీ కంటతడి పెట్టించింది. మృతుల వివరాలివీ..!

దామెరగడ్డ కృష్ణ: ఆలూరుకి చెందిన దామెరగడ్డ కృష్ణ ఐటీఐ పూర్తి చేసి రైల్వే నియామక పరీక్ష రాశాడు. ఫలితం కోసం ఎదురుచూస్తున్నాడు. టమాటా బాక్సులు తీసుకెళ్లేందుకు వచ్చి.. ప్రమాదంలో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. నక్కలపల్లి రాములు: ఆలూరుకి చెందిన రాములు రైతు. తన పొలంలో పండించిన కూరగాయల్ని విక్రయిస్తుంటాడు. ఇదే లారీ ప్రమాదంలో దుర్మరణంపాలయ్యాడు. శ్యామల సుజాత: నాంచేరుకి చెందిన సుజాత ఆలూరు రోడ్డు పక్కనే ఉండే తన పొలంలో దిగుబడులను విక్రయిస్తుంది. ఈ ఘటనలో ఆమె మరణించింది. జమీల్: రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెంకు చెందిన జమీల్.. ఉపాధి కోసం టోలీచౌకి వచ్చాడు. బేకరీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆలూరులో స్నేహితుల్ని కలిసేందుకు వచ్చిన సమయంలో ప్రమాదం జరగడంతో కన్నుమూశాడు.

# మూడు డివిజన్లు .. ముడి పడేనా!



కరీంనగర్ : జిల్లాలోని అసంపూర్తి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నిర్ణయంతో మెట్టప్రాంతమైన జిల్లా రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎల్లంపల్లి ఎత్తిపోతలు, కాళేశ్వరం–9వ ప్యాకేజీ పనులకు ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. వాటి పరిధిలో భూసేకరణ, పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ జరగాలి. వచ్చే వానాకాలం నాటికి అన్నీ పూర్తి చేసి కొత్త ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలనేది ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇంత వరకు బాగానే ఉన్నా జిల్లాలోని నీటిపారుదలశాఖ మూడు డివిజన్లలో ఎవరి దారి వారిదే అన్న తీరున ఉన్నాయి. ఇవి ముడిపడితేనే పనులన్నీ గట్టెక్కే అవకాశాలున్నాయి.

**రూ.100 కోట్ల పనులు ఎలా...**

నీటిపారుదలశాఖను 2021లో పునర్వ్యవస్థీకరించి అందులో చిన్న, మధ్య తరహా జలాశయాలు, ఎత్తిపోతల పథకాలన్నింటినీ ఒకే డివిజన్‌లోకి తీసుకొచ్చారు. జిల్లాను కరీంనగర్ ఈఎన్‌సీ పరిధిలోకి తీసుకొచ్చారు. అదేవిధంగా జిల్లాను 6, 7, 8 డివిజన్లగా ఏర్పాటు చేసి జిల్లా స్థాయి అధికారిని నియమించారు. డివిజన్‌కో అధికారిని నియమిస్తే బాగుండేది. అలా చేయలేదు. 6వ డివిజన్ పరిధిలో వేములవాడ, చందుర్తి, రుద్రంగి, కథలాపూర్ నాలుగు సబ్ డివిజన్లు ఉన్నాయి. దీనిలోకి శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం వస్తుంది. ఇవన్నీ జగిత్యాల సీఈ పరిధిలో ఉన్నాయి. అదేవిధంగా జిల్లాలో ఉన్న బోయినపల్లి మండలాన్ని దిగువమానేరు ఈఈ పరిధిలోకి, ఇల్లంతకుంట మండలాన్ని మధ్యమానేరు ఈఈ పరిధిలోకి తీసుకొచ్చారు.

7వ డివిజన్‌లోకి తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, చందుర్తి, రుద్రంగి, కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాలు వస్తాయి. ఈ డివిజన్ కార్యాలయం కలెక్టరేట్‌లో ఉంది. ఇది కరీంనగర్ సీఈ, ఈఎన్‌సీ పరిధిలోకి వస్తుంది. అలాగే 8వ డివిజన్‌లో సిరిసిల్ల, కోనరావుపేట, వేములవాడ అర్బన్, రూరల్, వీర్నపల్లి మండలాలు ఉన్నాయి. ఇందులోనే కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఉంది. నియోజకవర్గాన్ని గానీ, రెవెన్యూ డివిజన్‌ను గానీ ఒక పరిధిగా తీసుకోకుండా ఇష్టానుసారంగా చేశారు. దీంతో పర్యవేక్షణ ఇబ్బందిగా మారింది. మరోవైపు రైతులకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నలుగురు ఈఈలు చూసుకోవాల్సిన జిల్లాలో ఇద్దరు మాత్రమే ఉన్నారు.

కాళేశ్వరం 9వ ప్యాకేజీలో అసంపూర్తి పనులకు ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. దీంతోపాటు కాళేశ్వరం 11, 12 ప్యాకేజీల్లో కాల్వల నిర్మాణాలు డివిజన్ 8 పరిధిలో ఉన్నాయి. ఈ డివిజన్ చూసుకునే ఈఈనే జిల్లా ఇరిగేషన్ అధికారి బాధ్యతలు కూడా చూస్తున్నారు. జిల్లాలో అస్తవ్యస్తంగా ఉన్న నీటిపారుదలశాఖను సరిచేస్తేనే ప్రభుత్వం తలపెట్టిన అసంపూర్తి ప్రాజెక్టుల నిర్మాణాలు సకాలంలో పూర్తవుతాయి. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వేములవాడ నియోజకవర్గంలో ఎల్లంపల్లి స్టేజ్–2, ఫేజ్–1లో అసంపూర్తి నిర్మాణాలకు ప్రభుత్వం కొత్త కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు, సూరమ్మ చెరువు నిర్మాణానికి సుమారు రూ.100 కోట్లను మంజూరు చేసింది. పైగా వీరు కేవలం ఎల్లంపల్లి పనులకు మాత్రమే పరిమితం. డివిజన్ 6లో చేపట్టే పనులన్నీ జగిత్యాల సీఈ పరిధిలోకి వస్తాయి. ఈ డివిజన్ వారు ఎల్లంపల్లి పనులకు మాత్రమే పరిమితం. ఎత్తిపోతల పథకం పరిధిలోని 15 చెరువులు, కాల్వల నిర్వహణ అంతా డివిజన్–7 వాళ్లే చూసుకోవాలి. దీంతోపాటు ఇటు సిరిసిల్ల నియోజకవర్గంలోని ఎగువమానేరు కింద 26 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 433 చెరువుల చెరువుల నిర్వహణ కూడా ఈ డివిజన్ వాళ్లే చూసుకోవాలి. అంతే కాకుండా ప్రస్తుతం రూ.35 లక్షలతో చెరువుల ఆపరేషన్స్, నిర్వహణ పనులు జరుగుతున్నాయి.

# వినియోగదారులూ తస్మాత్ జాగ్రత్త!



కరీంనగర్ : పెద్దపల్లిలో వినియోగదారుడు ఇటీవల ఓ దుకాణంలో తినుబండారాలు కొనుగోలు చేశారు. దానిపై ధర, ఇతర వివరాలు లేవు. దీనిపై ఆయన దుకాణ యజమానిని నిలదీస్తే.. ఇష్టముంటే కొనండి.. లేకుంటే లేదని సమాధానమిచ్చారు. కరీంనగర్‌లో ఓ ఉద్యోగి పాల ప్యాకెటు కొనుగోలు చేశాడు. దానిపై ఎలాంటి వివరాలు ముద్రించి లేవు. జగిత్యాలలో ఓ వ్యక్తి బుక్‌స్టాల్‌లో నానోటేప్ కొనుగోలు చేశారు. ప్యాకింగ్‌పై ఎలాంటి వివరాలు లేవు. కనీసం ఎమ్మార్పీ కూడా ముద్రించి లేదు. దుకాణ యజమాని ఎంత అడిగితే అంత ఇవ్వాల్సి వచ్చింది.

న్యూస్‌టుడే, తెలంగాణచౌక్ : ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని పలు సంస్థలు, వ్యక్తులు రకరకాల తినుబండారాలు, వస్తువులను విక్రయిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ.. మోసాలకు తెర తీస్తున్నారు. తూకం, కొలతల్లో తేడాలు, చిరునామా, గడువు, తయారీ ప్రాంతం తదితర వివరాలు లేకుండానే ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. ఎలాంటి ముద్రణలేని వస్తువుల ప్యాకింగ్‌లు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ప్యాకెట్లపై ఏయే వివరాలు ఉండాలి, మార్కెట్లో ఏం జరుగుతోంది. తదితర వివరాలతో 'న్యూస్‌టుడే కథనం.

**ఏం జరుగుతుందంటే..**

చాలా చోట్ల ప్యాకెట్లపై వివరాలు ముద్రించడంలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో తినుబండారాలు తయారు చేస్తూ వాటిని ప్యాకింగ్ రూపంలో ఇతర జిల్లాలు, రాష్ట్రాలకూ ఎగుమతి చేస్తున్నారు. నాణ్యత లేనివి తయారు చేయడంతోపాటు వాటిపై ఎలాంటి వివరాలు ఉండటంలేదు.

గడువు తేదీ లేకపోవడంతో అందులో వస్తువులు చెడిపోతుంటాయి. వాటిని తిన్నప్పుడు అనారోగ్య పాలయ్యే ప్రమాదముంది.

ఎలాంటి ప్రాంతంలో తయారు చేస్తున్నారు. ఏయే వస్తువులు కలిపారు. దాని ధర ఎంత అనే వివరాలు తెలియడంలేదు.

విక్రయాలపై తప్పనిసరిగా తూనికలు, కొలతల శాఖ నుంచి అనుమతులు పొంది ఉండాలి. ప్యాకింగ్‌పై ముద్రించే లోగో, ఇతర వివరాలను సంబంధిత శాఖకు ఇవ్వాలి. కానీ జరగడం లేదు.

**ఇవి గమనించండి..**

ఏ ఆహార పదార్థాలు అయినా ప్యాకింగ్ చేసి విక్రయిస్తే దానిపై తప్పనిసరిగా పూర్తి వివరాలు నమోదు చేయాలి. సంస్థ పేరు, చిరునామా, పిన్‌కోడ్, వస్తువు పరిమాణం, అందులో కలిపిన వివరాలు, అమ్మకం ధర, తయారీ తేదీ, గడువు, చరవాణి నంబర్, కస్టమర్ కేర్ వివరాలను తప్పనిసరిగా ప్యాకెట్‌పై ముద్రించాలి. ఆ వివరాలు ప్యాక్‌పై ఉన్నాయో లేదా చూడాలి. అలాంటి వివరాలు లేకపోతే కొనకపోవడం మంచిది.

పదార్థాలు గడువులోగా చెడిపోతే కస్టమర్ కేర్‌కు ఫోను చేసి అడగటానికి వీలుంటుంది.

ప్యాక్‌లో ఏది ఎంత మోతాదులో ఉందో ముద్రించారా, లేదా పరిశీలించాలి. వివరాలు లేకుంటే తూనికల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

ప్యాకింగ్‌పై చెరిపివేతలు, పాత వివరాలపై స్టిక్కర్లు అతికించడంలాంటివి చేశారమో పరిశీలించండి. గ్రాము నుంచి కిలో వరకు ఎంత ధర పలుకుతుందో దానిపై ముద్రించి ఉండాలి. ఫిర్యాదు చేయండి ప్యాకింగ్ చేసి విక్రయించే వారు నిబంధనలు పాటించాలి. కొనుగోలుదారులకు అర్థమయ్యే విధంగా వివరాలు ముద్రించాలి. ధర, గడువు తేదీ ఇలా ప్రతి అంశం తెలియజేయాలి. అలా చేయకున్నా, ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయించినా వినియోగదారులు ఫిర్యాదు చేయాలి. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఏమైనా ఫిర్యాదులు చేయాలనుకుంటే నేరుగా మా కార్యాలయంలోగానీ %clm-ts@nic.in% –లో గానీ ఫిర్యాదు చేయొచ్చు. విజయసారథి, తూనికల, కొలతల శాఖ సహాయ నియంత్రణాధికారి

# సర్వే సమాప్తం.. ఆన్‌లైన్ వేగవంతం



పెద్దపల్లి : జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర సర్వే పూర్తయింది. కొన్నిరోజులుగా గణకులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. బంధువుల ఇళ్లకు తాళం, వలస వెళ్లిన వారి కారణాలు తెలుసుకుంటూ మరోసారి సందర్శించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను మండల కార్యాలయాల్లో కంప్యూటరీకరణ కొనసాగుతోంది. స్థానిక సిబ్బందితోపాటు అవసరమైన చోట్ల ప్రత్యేకంగా ఆపరేటర్లను నియమించి నిక్షిప్తం చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,01,054 ఇళ్ల వివరాలు నమోదు చేయగా 80.78 శాతం నమోదైంది.

**జిల్లాలో తేలిన కుటుంబాలు**

జిల్లాలో రామగుండం నగరపాలిక సంస్థ, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పురపాలికలు, 267 గ్రామ పంచాయతీల్లో సమగ్ర ఇంటింటి సర్వేలో కుటుంబాల సంఖ్య తేలింది. జిల్లాలో కుటుంబాల సంఖ్య పెరిగింది. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 1,65,484, పట్టణాల్లో 83,500 కలుపుకొని మొత్తం 2,48,984 కుటుంబాలు ఉన్నాయి. గ్రామీణంలో కంటే పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ ఇళ్లకు తాళం వేయడంతో సర్వే ఇబ్బందిగా మారింది. కొన్నిచోట్ల తాళం వేసిన ఇళ్ల బంధువులు, ప్రజాప్రతినిధుల నుంచి ప్రాథమికంగా సమాచారాన్ని సేకరించారు.

**సభ్యులు ఎక్కువ ఉంటే అరగంట**

కంప్యూటర్ పరిజ్ఞానం తెలిసిన వారికి ఆపరేటర్ బాధ్యతలు ఇచ్చారు. గణకులు చేసిన ఫారాలను ఆన్‌లైన్ ప్రక్రియలో వేగం పెంచుతున్నారు. ఒక్కో కుటుంబానికి కనీసం 15–20 నిమిషాలు ఉండగా సభ్యులు ఎక్కువగా ఉంటే అరగంట వరకు పడుతుంది. మొదట్లో ఆన్‌లైన్ చేయడంలో కొంత సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ప్రతి ఫారానికి నమోదు చేయాలంటే ఓటీపీ అవసరం. అయితే సాంకేతిక సమస్యతో కొంత ఇబ్బంది ఏర్పడింది. ప్రజాపాలన దరఖాస్తుల నమోదులో అనేక పొరపాట్లు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం తప్పులు లేకుండా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

# నిబంధనల పక్కా అమలు.. ఆదాయం కుదేలు

గోదావరిఖని : స్థిరాస్తి వ్యాపారం పెద్దఎత్తున సాగే ఉమ్మడి జిల్లాలో కొన్ని నెలలుగా రిజిస్ట్రేషన్‌లు తగ్గిపోతున్నాయి.. ఇటీవల హైదరాబాద్‌లో హైడ్రా ద్వారా జలాశయాల ఎఫ్‌టీఎల్‌ల పరిధిలోని నిర్మాణాలను కూల్చివేయడం.. బఫర్ జోన్‌లు, ముంపు ప్రాంతాల్లో ఉన్న భూముల్లో నిర్మాణాలకు అనుమతించకపోవడం ఇక్కడి స్థిరాస్తి వ్యాపారంపై ప్రభావం చూపుతోంది.. మరోవైపు ప్రభుత్వం జీవో 257 నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని పేర్కొనడంతో రిజిస్ట్రేషన్లు తగ్గడానికి కారణమయ్యింది.. ఈ క్రమంలో ఆదాయం బాగా తగ్గిపోయింది..హైదరాబాద్ మహా నగరం పరిధిలోని జలాశయాల పరిరక్షణపై దృష్టి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) ఏర్పాటు చేసింది. ఈ సంస్థ జలాశయాల ఎఫ్‌టీఎల్ (పూర్తి నీటి సామర్థ్యం) పరిధిలో ఉన్న నిర్మాణాలను కూల్చివేయడం.. మరికొన్నింటికి నోటీసులు ఇవ్వడంతో జిల్లాల్లోనూ భయం మొదలైంది. హైడ్రా కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి నాలుగు జిల్లాల్లోనూ జనం స్థలాలు కొనుగోలు చేసేందుకు వెనుకాముందాడుతున్నారు. లేఅవుట్ అనుమతులు ఉన్నా యా.. జలాశయాల ఎఫ్‌టీఎల్ పరిధి.. బఫర్ జోన్‌లో ఈ స్థలం



ఉందా అనేది ఒకటికి రెండుసార్లు సరి చూసుకునే కొనుగోలు చేస్తున్నారు. దీని ప్రభావం ప్లాట్ల విక్రయాలపై పడింది.

**జీవో అమలుతో..**

గతంలోనే ప్రభుత్వం జీవో 257 తీసుకు వచ్చినా అధికారులు అందులో నిబంధనలపై పట్టింపుతో వ్యవహరించేవారు కాదు. ప్రస్తుత ప్రభుత్వం ఆ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేయడంతో రిజిస్ట్రేషన్‌ల విషయంలో అధికారులు జీవోలో పేర్కొన్న అంశాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

ఆమోదం పొందిన లేఅవుట్‌లోని స్థలం అయి ఉండాలి.

నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్) మార్పు జరగాలి.

లింకు డాక్యుమెంట్లు సరిగా ఉండాలి.

ఎల్‌ఆర్‌ఎస్ (భూమి క్రమబద్ధీకరణ) అయి ఉండాలి. 2017, 2020లలో అప్పటి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తులు ఆహ్వానించినా ఇప్పటికి నిర్ణయం తీసుకోలేదు.

కచ్చితత్వంతో..ప్రభుత్వం నిబంధనలు కచ్చితంగా పాటించాలన్న ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ఎలాంటి పొరపాటు ఉన్నా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌లు చేయకుండా పక్కన పెడుతున్నారు. 257 జీవోకు అనుగుణంగా ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. బఫర్ జోన్‌లు, ముంపు ప్రాంతాల్లో ఉన్న వాటి విషయంలోనూ పూర్తి వివరాలు పరిశీలిస్తున్నారు.

**30 శాతానికి పడిపోయిన రాబడి**

రిజిస్ట్రేషన్‌లు తగ్గిపోవడంతో ఆ శాఖకు ఆదాయం కూడా పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో 14 రిజిస్ట్రేషన్ కేంద్రాలున్నాయి. వీటిలో జులై నుంచి ఆదాయం పడిపోతూ వచ్చింది. నవంబరు నాటికి 30 శాతం ఆదాయం తగ్గిపోయింది. రామగుండం సబ్ రిజిస్ట్రార్ తిరుపతి మాట్లాడుతూ నిబంధనలు కచ్చితంగా పాటించడం, హైడ్రా ప్రభావం రిజిస్ట్రేషన్లు తగ్గడానికి కారణమవుతున్నాయన్నారు. జీవో 257 నిబంధనల వల్ల చాలా డాక్యుమెంట్లు పక్కన పెడుతున్నామని చెప్పారు.

# నిర్మాణపు లోగుట్టు.. నిధుల కని'కట్టు'!

కరీంనగర్ : ఇది.. కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్‌లోని ముదిరాజ్ సంఘ భవన్క. బహుళ అంతస్తుల్లో నిర్మించాలనుకున్న దీనికి ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలను కేటాయిస్తూ 2022 జులై 19న ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నిర్మాణానికి సాంకేతిక అనుమతులు వచ్చాయి. కానీ సదరు గుత్తేదారు ఇక్కడ ఒక్క ఇటుక పెట్టకుండా.. సిమెంట్, ఇసుకను కలపకుండా.. ఈ నిధులను కాజేశారని సంఘం సభ్యులంతా ఆధారాలతో కార్పొరేషన్ ఉన్నతాధికారులతోపాటు పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గుత్తేదారుతోపాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లోని ఇంజినీరింగ్ అధికారుల వైఫల్యం, నిర్లక్ష్యం ఈ బిల్లు చెల్లింపు విషయంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అధికారులు కనీస నిర్మాణ స్థలాన్ని పరిశీలించకుండానే బిల్లులను అందజేసినట్లు పక్కాగా అర్థమవుతోంది. ఒకవేళ గుత్తేదారు అధికారుల కళ్లుగప్పే ప్రయత్నం చేసినా.. చాకచక్యంగా వ్యవహరించాల్సిన సంబంధిత విభాగం కళ్లు మూసుకుని పని చేసిందా..? అనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలోనూ అడపాదడపా బల్దియాలో పనిచేసే కొందరి పనితీరు సరిగ్గా ఉండదనే ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. అక్రమ వసూళ్లతోపాటు కమీషన్లు ఇతరత్రా అభియోగాలను కొందరు ఎదుర్కొన్నారు. తాజాగా అసలు చేయని పనికి ఇంతమొత్తాన్ని అప్పనంగా ఎలా చెల్లించారని ఉన్నతాధికారులు విస్మయానికి గురవుతున్నారు. మరోవైపు ముదిరాజ్ సంఘ్య స్థానంలో రికార్డుల్లో పొందుపర్చిన భవనం ఎక్కడిదనేది మరో సమస్యగా మారింది. ఆ నిర్మాణాన్ని పరిశీలిస్తే అందులో ఉన్న గేటు ఆధారంగా ఏదైనా ఇంటి భవనమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సమగ్ర విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఈ ఫొటోలో నిర్మాణ భవనాన్ని చూపిస్తూ.. తమ కమ్యూనిటీ భవన నిర్మాణ బిల్లును పొందారని సంఘం సభ్యులు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. మంజూరైన నిధులు ఖర్చయినట్లు బల్దియా ఇంజినీరింగ్ అధికారులు రికార్డుల్లో నమోదు చేశారు. 28 ఆగస్టు 2024న ఇందుకు సంబంధించిన బిల్లు రూ.4,51,340 సదరు గుత్తేదారుకు చెల్లించినట్లు కార్పొరేషన్ రికార్డుల్లో స్పష్టంగా ఉంది. అసలు భవనం వద్ద ఎలాంటి పనులు చేపట్టకుండా నిధులెలా ఇస్తారనేది ఇప్పుడు అంతుచిక్కని ప్రశ్నగా మారింది. అటు పోలీసు, ఇటు కార్పొరేషన్ ఉన్నతాధికారులు దీనిపై విచారణ చేపడుతున్నారు.


**వెలుగులోకి ఇలా..** కరీంనగర్ బైపాస్ మార్గంలో ముదిరాజ్ సంఘ భవనంతోపాటు అక్కడ వివాహ వేడుకలకు వీలుగా బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించాలని సంఘం సభ్యులు కొన్నేళ్ల కిందట నిర్ణయించారు. మొదట సభ్యులంతా ఎంతో కొంత చందాలుగా వేసుకొని పునాది, పిల్లర్ల స్థాయి నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం స్థానిక ఎంపీని 2022లో కలిస్తే వెంటనే రూ.5 లక్షలు ఎంపీ నిధుల నుంచి వెచ్చించారు.

# పేరుకే ఉచిత వైద్యం.. సేవలు అంతంతమాత్రం..!

కొత్తగూడెం : పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిన ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు నామమాత్రంగానే లభిస్తున్నాయి. వైద్యులు, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు ఆసుపత్రులను వెంటాడుతున్నాయి. ప్రధానంగా కొత్తగూడెం సర్వజనాసుపత్రిలో అత్యవసర సమయంలో వైద్యమందించలేని పరిస్థితులు దాపురించాయి. నిత్యం 500 మందికిపైగా ఓపీ, 150 మందికి మించి ఇన్‌పేషంట్లకు సేవలందిస్తున్నప్పటికీ అత్యవసర వైద్యం కోసం ప్రైవేట్ దవాఖానాలపై ఆధారపడాల్సి వస్తోంది.

**ఎంసీహెచ్‌ను పట్టించుకుంటేనే..**

గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు మెరుగైన వైద్యమందించాలనే లక్ష్యంతో జిల్లాలో మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆసుపత్రి ప్రారంభించిన కొత్తలో నెలకు 500కుపైగా ప్రసవాలతో గర్భిణులకు సేవలందించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో కొంతకాలంగా వైద్యులు, సిబ్బంది కొరతతో మాసానికి 200-210




కాన్పులు మాత్రమే జరుగుతున్నాయి. ఇక్కడ ఆశించిన స్థాయిలో వైద్యమందకపోవటం వల్ల పాల్వంచ, ఇల్లెందు సీహెచ్‌సీలు, భద్రాచలం ప్రాంతీయాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఎంసీహెచ్‌లో కొన్ని నెలలుగా రేడియాలజిస్ట్ లేకపోవటంతో గర్భిణులకు వైద్యపరీక్షలు కరవయ్యాయి. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు ప్రైవేటులో స్కానింగ్ చేయించుకోవాల్సి వస్తోంది. అందుకే ఆసుపత్రిలో ఓపీ తగ్గిపోయి.. ప్రసవాల సంఖ్య పడిపోతోంది.

**పడిపోయిన పీహెచ్‌సీల ర్యాంకు**

క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు నానాటికీ తీసికట్టుగా తయారవుతున్నాయి. గత ఏప్రిల్, మే మాసాల్లో భద్రాద్రి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండగా.. ప్రస్తుతం 12వ స్థానానికి దిగజారటమే ఇందుకు నిదర్శనం. వైద్య సిబ్బంది కొరత, మౌలిక వసతుల కల్పనలో విఫలమవటం వల్లే పీహెచ్‌సీల ప్రమాణాలు పతనమవుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏఏ విభాగాల్లో పీహెచ్‌సీలు మెరుగైన ఫలితాలు సాధించటం లేదో గుర్తించి వైద్యాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

**సీహెచ్‌సీల్లో మెరుగైన సేవలు**

వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లలో మెరుగైన సేవలందుతున్నాయి. ప్రసవాల విషయంలో ఎంసీహెచ్ కంటే భద్రాచలం ప్రాంతీయాసుపత్రి మెరుగ్గా ఉంది. మణుగూరు, ఇల్లెందు, పాల్వంచ సీహెచ్‌సీల్లో అత్యాధునిక శాస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. చర్ల, మణుగూరు, బూర్గంపాడు సీహెచ్‌సీల్లో గైనకాలజిస్టుల కొరత వేధిస్తోంది. వైద్యులను నియమిస్తే ఈ మూడుచోట్లా గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందుతాయి.

**అక్టోబర్‌లో జరిగిన ప్రసవాలు**

మాతాశిశు ఆరోగ్య కేంద్రం: 207
భద్రాచలం ఏరియా ఆసుపత్రి: 348
ఇల్లెందు: 46
అశ్వారావుపేట: 26
పాల్వంచ సీహెచ్‌సీ: 95

పీహెచ్‌సీ ర్యాంకుల్లో ఒడిదొడుకులు ఉంటాయి. గతంలో మొదటి స్థానంలో ఉన్నాం. ప్రస్తుతం ఎక్కడైతే విఫలమవుతున్నామో అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేస్తున్నాం. త్వరలోనే మొదటి స్థానానికి చేరుకుంటాం. భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ

సర్వజనాసుపత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇటీవల సీనియర్ రెసిడెంట్లు శిక్షణ కాలం పూర్తిచేసుకొని వెళ్లిపోయారు. ఎంసీహెచ్‌కు వచ్చే గర్భిణులను అవసరమనుకుంటేనే ఇతర ఆసుపత్రులకు పంపిస్తున్నాం. వైద్యసిబ్బంది నియామకాలు చేపడుతున్నాం. త్వరలోనేపూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. రాధామోహన్, సూపరింటెండెంట్, సర్వజనాసుపత్రి

# కళ్ల ముందే దర్జాగా కబ్జా!

ఆసిఫాబాద్: సర్కారీ భూములను కళ్ల ముందే కొల్లగొడుతున్నా.. ఏ అధికారికీ కనిపించదు. నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీ భూముల్లో వెంచర్లు వెలుస్తున్నా.. వారికి పట్టదు. కాలువలను పూడ్చి ఏకంగా నిర్మాణాలు చేపడుతున్నా.. నిలువరించే ప్రయత్నాలు కానరాదు. ఈ తతంగమంతా జిల్లా ఆవిర్భావం నుంచి కొనసాగుతూనే ఉంది. బాండ్ పేపర్ల మీద రాసుకుంటూ ఈ భూములను క్రయ విక్రయా లు జరుపుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తున్నా పుర అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అక్రమ కట్టడాల గురించి తనిఖీల ఊసే లేకపోవడంతో ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆసిఫాబాద్ పట్టణం 2024న ఫిబ్రవరి 1న పురపాలికగా మారింది. ఇటీవలే కొలతలు పూర్తికాగా 20 వార్డులతో ఆసిఫాబాద్ పురపాలిక, షెడ్యూల్ ప్రాంతాన్ని రాజంపేట పంచాయతీగా ఏర్పాటు చేశారు. పుర, పంచాయతీ విస్తరించి ఉన్న ప్రాంతాల్లో డీటీసీపీ (డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) అనుమతులు లేకుండానే వెంచర్లు వేస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని బీడీపీపీ (బిలా దాఖల పోరంబోకు) భూములను సైతం బాండ్ పేపర్ల మీద రాసిస్తూ పలువురికి అంటగడుతున్నారు. పదుల సంఖ్యలో భవనాలు బీడీపీపీ భూముల్లో పూర్తవుతుండగా, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లలో పట్టణ ప్రణాళిక అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కాలువ పూడ్చి చదును చేశారిలా.. ఆసిఫాబాద్‌లోని అటవీ చెక్‌పోస్టు ఎదురుగా 215 ఎకరాల బీడీపీపీ ఉంది. సర్వే నంబర్ 39/ఏ, 39/బీ నాలుగు ఎకరాలు రహదారిని ఆనుకుని ఉంటాయి. ఈ భూముల మధ్య నుంచి పెద్దవాగుకు వెళ్లే ఓ కాలువ ఉంది. దీనికి సుమారు 100 అడుగుల మేర అడ్డంగా, మొరంతో పూడ్చి ఆ స్థలాన్ని మొత్తం చదును చేశారు. కాలువ ఒడ్డున ఉన్న ప్రభుత్వ స్థలం చుట్టూ సైతం ప్రహరీ నిర్మించారు. ఈ స్థలం విలువ సుమారు రూ.4 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇవిగో అక్రమాలు..ఆసిఫాబాద్ మండలంలోని గుండి వెళ్లే మార్గంలో ఏజెన్సీ భూముల్లో ఓ వ్యక్తి వెంచర్ వేశాడు. ఇప్పటికే ప్లాట్ల వరకు అమ్మడు కాగా, ఎలాంటి అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో భవన నిర్మాణాలు ఈ ప్రాంతంలో వెలుస్తున్నాయి. జన్కాపూర్ శివారులో పెట్రోల్‌బంక్ వెనుక ఓ నేత వెంచర్ వేశాడు. డీటీసీపీ అనుమతులు లేకుండానే ప్లాట్లు విక్రయించాడు.

# మహాభివృద్ధికి వేళాయె..



హైదరాబాద్: రాజధాని ప్రజల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.5,942 కోట్ల విలువైన రహదారి అభివృద్ధి పనులకు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాదవుతున్న సందర్భంగా సర్కారు ఆధ్వర్యంలో ఐకామ్స్ వద్ద ఈ వేడుక జరగనుంది. హెచ్-సిటీ(హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పేరుతో చేపట్టనున్న ఆయా అభివృద్ధి పనుల్లో.. పైవంతెనలు, అండర్‌పాస్‌లు, ఆర్‌యూబీ, ఆర్వోబీ పనులతోపాటు రోడ్డు విస్తరణ పనులు కూడా ఉన్నాయి. మూసాపేట, బాలానగర్, కూకట్‌పల్లి, మియాపూర్, శేరిలింగంపల్లి, హైటెక్‌సిటీతోపాటు పాతబస్తీలో భాగమైన మెహిదీపట్నం, నానల్‌నగర్, మహమ్మదీయ లేన్స్, లంగర్‌హౌజ్, అత్తాపూర్, కాటేదాన్, ఆరాంఘర్‌చౌరస్తా, శాస్త్రీపురం, ఇతరత్రా ప్రాంతాలకు హెచ్-సిటీతో ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయి. ఇవి కాకుండా.. ఆరాంఘర్ నుంచి జూపార్కు వరకు నిర్మించిన పైవంతెన ప్రారంభం, కేబీఆర్ పార్కు చుట్టూ నిర్మించతలపెట్టిన పైవంతెనలకు, ఇతరత్రా కలిపి రూ.3,500కోట్ల పనులకు కూడా ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు ఉండనున్నాయని జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు వెల్లడించారు. రూ.150కోట్లతో చేపట్టిన కూడళ్ల సుందరీకరణ పనులు, రూ.16 కోట్లతో నిర్మించిన వరదనీటి భూగర్భ జలాశయాల ప్రారంభోత్సవం ఉందన్నారు.

ఇవే హెచ్-సిటి ప్రాజెక్ట్ పనులు..

టోలిచౌకి, అత్తాపూర్, లంగర్‌హౌజ్, మహమ్మదీయ లేన్స్, మెహిదీపట్నం ప్రాంతాల మధ్య ట్రాఫిక్ సమస్యలు తీర్చేందుకు రేతిబౌలి కూడలి, నానల్‌నగర్ కూడళ్లలో రూ.398 కోట్లతో పైవంతెనల నిర్మాణం.

రూ.210 కోట్లతో పంజాగుట్ట నాగార్జున కూడలి నుంచి బంజారాహిల్స్ వైపు పైవంతెన, టీవీ9 ఆఫీసు వద్ద అండర్‌పాస్ నిర్మాణం.

రూ.120 కోట్లతో బంజారాహిల్స్ విరంచి ఆస్పత్రి నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు రోడ్డు విస్తరణ.

రూ.837 కోట్లతో ట్రిపుల్‌ఐటీ కూడలిలో ఆరు లైన్ల అండర్‌పాస్‌ల నిర్మాణంతోపాటు.. విప్రో రోడ్డు, డీఎల్‌ఎఫ్ రోడ్ల మధ్య నాలుగులైన్ల పైవంతెనలు, విప్రో కూడలిలో ఓ పైవంతెన, రెండు అండర్‌పాస్‌ల నిర్మాణం.రూ.124 కోట్లతో లింగంపల్లి రైల్వే ఆర్‌యూబీ వద్ద పైవంతెన నిర్మాణం.

రూ.180 కోట్లతో మూసాపేట వై జంక్షన్‌లో.. కూకట్‌పల్లి నుంచి మూసాపేటవైపు వెళ్లే వాహనాల కోసం రెండు లైన్ల పైవంతెన, బాలనగర్ నుంచి కూకట్‌పల్లి వెళ్లే వాహనాలకు రెండు లైన్ల అండర్‌పాస్ నిర్మాణం.

రూ.56 కోట్లతో ఫాక్స్‌సాగర్ వద్ద పైపులైను రోడ్డుపై స్టీలు వంతెన నిర్మాణం.

రూ.960 కోట్లతో కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం.

ఎల్బీనగర్ టీకేఆర్ కాలేజీ కూడలిలో రూ.416 కోట్లతో పైవంతెన.

రూ.200 కోట్లతో మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్ రోడ్డు, కాటేదాన్ కూడళ్లపై పైవంతెన.

రూ.59 కోట్లతో ఆరాంఘర్ ఆర్‌యూబీ వద్ద పైవంతెన.

రూ.320 కోట్లతో బాలాపూర్, చాంద్రాయణగుట్ట, హఫీజ్‌బాబానగర్, గౌస్‌నగర్‌లలో రోడ్డు విస్తరణ.

రూ.543 కోట్లతో బెంగళూరు జాతీయ రహదారి నుంచి శాస్త్రిపురానికి రోడ్డు విస్తరణ, శాస్త్రిపురం నుంచి ఇంజిన్‌బౌలికి రోడ్డు విస్తరణ.

రూ.339 కోట్లతో ఎల్బీనగర్ ఒవైసీ కూడలి పైవంతెనకు సంతోష్‌నగర్ వైపు ఓ డౌన్ ర్యాంపు, హఫీజ్ బాబా నగర్ కూడలిలో పైవంతెన, బండ్లకూడ కూడలిలో ఓ పైవంతెన నిర్మాణం.

రూ.530 కోట్లతో మియాపూర్ చౌరస్తాలో పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం.

రూ.505 కోట్లతో రసూల్‌పుర, పాటిగడ్డ ఆర్‌కే.పురం, చిలకలగూడ ప్రాంతాల్లో పైవంతెనలు, ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణం

రూ.115 కోట్లతో అమీన్‌పూర్, గచ్చిబౌలి చౌరస్తా, రాంకీ టవర్స్ తదితర ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ

ఆరు ఎస్టీపీలు అందుబాటులోకి..

జలమండలి నిర్మించిన ఆరు మురుగునీటి శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీలు), 19 రిజర్వాయర్లను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించనున్నారు. వర్చువల్‌గా వీటిని ప్రారంభిస్తారని జలమండలి అధికారులు పేర్కొన్నారు. నాగోలు ఎస్టీపీ (320 ఎంఎల్‌డీ), ఫతేనగర్(133 ఎంఎల్‌డీ), మీరాలం (41.5 ఎంఎల్‌డీ), ఖాజాకుంట (20 ఎంఎల్‌డీ), మియాపూర్-పటేల్ చెరువు (ఏడు ఎంఎల్‌డీ)లను సీఎం ప్రారంభిస్తారని తెలిపారు.

# సుజాతలీఖాన్ నేర కథాచిత్రమ్



హైదరాబాద్: నకిలీ బెయిలు పత్రాలతో చంచల్‌గూడ జైలు నుంచి తప్పించుకున్న నిందితుడు సుజాతలీఖాన్ నేర చరిత్ర కలకలం రేపుతోంది. నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో భూకబ్జా, ఎమ్మార్పీఎస్ నేతను కిడ్నాప్‌చేసి చిత్రహింసలు పెట్టిన కేసుల్లో సుజాతలీఖాన్ ప్రధాన నిందితుడు. దాదాపు మూడున్నర నెలలు పరారీలో ఉన్న నిందితుడు ఇప్పుడు ఏకంగా నకిలీ బెయిలు పత్రాలతో జైలుఅధికారులను తప్పుదోవపట్టించి బయటపడడం సంచలనం కలిగించింది. ఇతని గ్యాంగ్ ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జాకు పాల్పడడంతో పాటు ఎవరైనా ఎదిరిస్తే కిడ్నాప్‌చేసి శంషాబాద్‌లోని ఫాంహౌస్‌లో వేటకుక్కల మధ్య బంధించి భయభ్రాంతులకు గురిచేస్తుంది. సుజాయత్ అలీ, ఫక్రుద్దీన్ అనుచరులపై నార్సింగిలో అయిదు, శంషాబాద్ ఠాణాలో ఒక కేసు ఉన్నాయి. ఇవన్నీ భూకబ్జాలు.. దాడులు, కిడ్నాప్‌నకు సంబంధించినవే.

ఇప్పటివరకు వీరి గ్యాంగ్ సభ్యులు 16 మంది పోలీసులకు చిక్కారు. డమ్మీ తుపాకులు, ఎయిర్ గన్‌లు, కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

**న్యాయవాదులుగా చెలామణి..**

సంతోష్‌నగర్ హెచ్‌ఐజీకాలనీకి చెందిన సుజాతలీఖాన్(27) నార్సింగి బృందావన్‌కాలనీకి చెందిన ఫక్రుద్దీన్ న్యాయవాదులుగా చెలామణి అవుతూ భూకబ్జాలకు పాల్పడేవారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి.. గంటల వ్యవధిలో ప్రహరీ నిర్మించి ఆక్రమిస్తారు. పదుల సంఖ్యలో శునకాలు.. కత్తులు, నకిలీ తుపాకీలతో కిరాయి గూండాల్ని రక్షణగా ఉంచుతారు. ఎదురుతిరిగినవారిని కిడ్నాప్‌చేసి చిత్రహింసలు పెడతారు. ఇదే తరహాలో ఎమ్మార్పీఎస్ నేత నరేందర్, ప్రవీణ్‌ను కిడ్నాప్ చేసి ఫాంహౌస్‌లో బంధించారు. ఫాంహౌస్ పరిస్థితుల్ని చూసి పోలీసులే విస్మయం వ్యక్తం చేశారు.

**మూడున్నర నెలలకు ముంబయిలో చిక్కాడు**

భూకబ్జా, కిడ్నాప్‌లపై నార్సింగి పోలీసులు సుజాతలీఖాన్ మీద జులై 11న రెండు కేసులు నమోదుచేశారు. నాటి నుంచి పరారీలో ఉన్నాడు. దాదాపు మూడున్నర నెలలు గాలించిన పోలీసులు ముంబయిలో ఉన్నట్లు గుర్తించి నవంబరు 2న అరెస్టుచేశారు. చంచల్‌గూడకు తరలించారు. ఈ క్రమంలో ఓ న్యాయవాది సాయంతో పాతబెయిలు పత్రాలకు కొత్త తేదీలతో నకలు సృష్టించాడు. నిజమైనవేనని భావించి అధికారులు నవంబరు 26న విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో సమాచారం రాకపోవడంతో తనిఖీచేయగా నకిలీవని తేలింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అక్రమం.. రెండింతల పెన్నుతో సక్రమం

హైదరాబాద్ : " రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల సంచలనం సృష్టించిన ఓ ఫామ్‌హౌస్ నిర్మాణానికి యజమానులు ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి 7వేల గజాల్లో ఫామ్‌హౌస్ నిర్మాణం చేపట్టారు. ఈ ఏడాది జనవరిలో నిర్మాణం పూర్తిచేశారు. పంచాయతీ అధికారులు రూ.60వేలు పన్ను వసూలు చేశారు తప్ప అనుమతులు ఎందుకు తీసుకోలేదంటూ గట్టిగా ప్రశ్నించలేదు."

" శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ, బుల్కాపూర్, దొంతాన్‌పల్లి, ఇరుగుంట తండా, మహరాజ్‌పేట్, ప్రొద్దటూరు, టంగుటూరలో కొన్నేళ్లుగా ఫామ్‌హౌస్‌లున్నాయి. కొత్తగా నిర్మాణాలవుతున్నాయి. మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి, పెద్దమంగళారం, చిల్కూరు, కనకమామిడి గ్రామాల్లో ఫామ్‌హౌస్‌లున్నాయి."

నగరానికి సమీపంలోని జంట జలాశయాల పరివాహక ప్రాంతాలు, 111 జీవో పరిధిలోని గ్రామాల్లో దర్జాగా ఫామ్‌హౌస్‌లు నిర్మించినా... నిర్మిస్తున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు. అంతేకాదు.. అది అక్రమమని తెలిసినా కూల్చేయకుండా రెండింతలు పన్ను వసూలు చేసుకుంటూ.. 'సక్రమం' చేస్తున్నారు. దీంతో మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో పదుల సంఖ్యలో ఫామ్‌హౌస్‌లు నిర్మాణమవుతున్నాయి. ప్రముఖులు.. పై నుంచి ఒత్తిళ్లు.. మొయినాబాద్, శంకర్‌పల్లి మండలంలోని పలు గ్రామాలు 111 జీవో పరిధిలో ఉన్నాయి. నిబంధనల మేరకు ఆయా పంచాయతీల్లోని వ్యవసాయ భూముల్లో



ఫామ్‌హౌస్‌లు, ఇళ్లు నిర్మించకూడదు. ఆయా గ్రామాల్లో ఒక్కటంటే ఒక్క ఫామ్‌హౌస్‌కు పంచాయతీ అధికారుల అనుమతులు లేవు. వాటిలో 80శాతం ప్రముఖులు, సెలబ్రిటీలవి ఉండడంతో అధికారులు వాటిపై చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నారు. అంతేకాదు వాటిని పరిశీలించేందుకు వెళ్తే పైనుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి.

**కొత్తగా కన్వెన్షన్ కేంద్రాలు**

పంచాయతీ, రెవెన్యూ విభాగం అధికారులు అనుమతుల్లేని ఫామ్‌హౌస్‌లపై చర్యలు తీసుకోకపోవడంతో వ్యవసాయ భూములను ఆదాయంగా మార్చుకునేందుకు కొందరు భూ యజమానులు కొత్తగా కన్వెన్షన్ కేంద్రాలను నిర్మిస్తున్నారు. వీటిల్లో కొన్ని 111 జీవో పరిధిలో ఉండగా... మరికొన్ని సాగు భూముల్లో ఉన్నాయి. శంకర్‌పల్లి మండలం, మోకిల పరిసర ప్రాంతాల్లో మూడు, నాలుగు కన్వెన్షన్ కేంద్రాల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. ప్రధాన, జిల్లా రహదారులకు సమీపంలో వాటిని నిర్మిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప వివరాలు సేకరించడం లేదని విమర్శలున్నాయి.

# చేపా.. చేపా.. ఈసారైనా ఎదుగుతావా?

ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో చేపపిల్లల పంపిణీ పథకం ఎట్టకేలకు మొదలుకానుంది. ఎంపిక చేసిన చెరువుల్లో చేపపిల్లలను ప్రజాప్రతినిధులు, అధికారులు వదలనున్నారు. గతేడాది చేపపిల్లల సరఫరాలో గుత్తేదారులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. చేపపిల్లల సైజు, సంఖ్యలో భారీగా వ్యత్యాసమున్నట్లు ఖమ్మం కలెక్టర్ తనిఖీల్లో బయటపడింది. గుత్తేదారుల నిర్వాకంతో చేపపిల్లల ఎదుగుదల లేకపోవటంతో అనేక చెరువుల్లో మత్స్యకారులు వేట నిలిపేశారు. ఈసారైనా అలాంటి పొరపాట్లకు తావులేకుండా చేపపిల్లలను సరఫరా చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

లక్ష్యం ఇలా.. ఖమ్మం జిల్లాలో వాస్తవానికి 3.62 కోట్ల చేపపిల్లలను సరఫరా చేయాల్సి ఉండగా ఈసారి 1.75 కోట్లకు, భద్రాద్రి జిల్లాలో 1.77 కోట్ల చేపపిల్లలకు గాను 88 లక్షలకు లక్ష్యాన్ని కుదించింది. గతంతో పోలిస్తే ఈసారి దాదాపు రెండు నెలల తర్వాత చేపపిల్లల విడుదల కార్యక్రమం చేపడుతుండటంతో లక్ష్యం తగ్గింది. పాత బకాయిల చెల్లించలేదన్న సాకుతో టెండర్లకు గుత్తేదారులు నిరాసక్తత ప్రదర్శించటం, వర్షాకాలానికి ముందే జరగాల్సిన టెండర్ ప్రక్రియ సెప్టెంబర్‌లో ముగియటంతో ఈసారి చేపపిల్లల విడుదల కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభమవుతోంది. ఖమ్మం జిల్లా పరిధిలోని పాలేరు జలాశయంలో చేపపిల్లలను వదిలే కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారు. భద్రాద్రి జిల్లా సుజాతనగర్ మండలం సింగభూపాలెం చెరువులో చేపపిల్లలను ప్రజాప్రతినిధులు, అధికారులు వదలనున్నారు.

అవకతవకలకు ఆస్కారం ఉండొద్దు

ఉభయ జిల్లాల్లో గతేడాది చేపపిల్లల సరఫరాలో అవకతవకలు చోటుచేసుకున్నాయి. టెండర్ ప్రకారం కన్నా తక్కువ సైజు చేపపిల్లలు పంపిణీ చేశారని, సంఖ్యలోనూ భారీగా వ్యత్యాసముందని అధికారులు గుర్తించారు. చేపల ఎదుగుదల సరిగ్గా లేక అనేక చెరువుల్లో మత్స్యకారులు వేట నిలిపేశారు. ఈసీజన్‌లో భారీ వర్షాలు కురవటంతో చెరువులు నిండుకుండను తలపిస్తున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే చేపపిల్లల సరఫరా పారదర్శకంగా సాగుతుందని మత్స్యకారులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో పాలేరు జలాశయంలో చేపపిల్లలను వదిలే కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారు. ఎంపిక చేసిన చెరువుల్లోనూ క్రమక్రమంగా చేపపిల్లలను వేస్తాం. అవకతవకలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. గుత్తేదారులు నిబంధనల ప్రకారం సైజు, సంఖ్య తగ్గకుండా చేపపిల్లలు సరఫరా చేసేలా పర్యవేక్షిస్తాం. శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

# పదే పదే.. అదే మోసం

కొత్తగూడెం : ఆశ ఒక మనిషిని ఎంతదూరమైనా తీసుకెళ్తుందంటారు. అదీ, కుటుంబానికి భద్రత కల్పించే కొలువైతే.. కొందరు నిరుద్యోగ యువత అప్పులు చేసైనా దళారులు అడిగినంత ముట్టజెప్పేందుకు సిద్ధపడుతున్నారు. తప్పని తెలిసినా తప్పదనే భావనతో ఒకరిని చూసి మరొకరు ఇలా ప్రలోభాల వలలో చిక్కుకుంటున్నారు. చివరకు నిట్టనిలువునా మోసపోతున్నారు. ఆర్థికంగా అప్పుల్లో కూరుకుపోయి, గట్టెక్కే దారిలేక తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారు. జూలూరుపాడుకు చెందిన రత్నకుమార్, పార్వతి దంపతుల విషాదాంతమే ఇందుకు ఉదాహరణ. ప్రభుత్వ కొలువు దక్కాలనే ఉద్దేశంతో ఓ దళారీని నమ్మి ఏకంగా రూ.16 లక్షలు ముట్టజెప్పారు. స్థానికత, సింగరేణి కారుణ్య నియామకాల ఆశజూపి కాసులు కాజేసిన దళారీ చనిపోవటం, మధ్యవర్తి ముఖం చాటేయటంతో ఏంచేయాలో రత్నకుమార్‌కు పాలుపోలేదు. కొలువు భ్రమలో అప్పులపాలై దంపతులిద్దరూ బలవన్మరణానికి పాల్పడ్డారు. దళారులను నమ్మొద్దని సింగరేణి, కేటీపీఎస్ వంటి సంస్థలు, పోలీసులు ఎంతచెప్పినా మారని వారికి ఈ ఘటనే ఓ గుణపాఠం.

ఆశ పుట్టించి.. ఆపై పలాయనం చిత్తగించి..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిశ్రమలకు నెలవు. ముఖ్యంగా సింగరేణి, విద్యుత్తు కేంద్రాలైన కేటీపీఎస్, బీటీపీఎస్‌లో కారుణ్య, ఒప్పంద కొలువుల పేరిట దళారులు నిరుద్యోగ యువతను మోసగించటం



పరిపాటిగా మారింది. అధిక వేతనాలు, అంతకుమించి ఉద్యోగ భద్రత భ్రమలో పడి కొందరు భారీమొత్తంలో డబ్బు ముట్టజెప్పుతున్నారు. అదిగో.. ఇదిగో అని కొంతకాలం తిప్పుకొనే దగాకోరులు చివరకు పలాయనం చిత్తగిస్తున్నారు. గట్టిగా నిలదీస్తే ఎంతోకొంత ముట్టజెప్పి చేతులు దులిపేసుకుంటున్నారు. రత్నకుమార్ దంపతుల బలవన్మరణ ఘటన నేపథ్యంలోనైనా దళారుల్లో ప్రాయశ్చిత్తం కలగాలి. ఇలాంటి వారి ఆటకట్టించేందుకు పోలీసులు, పరిశ్రమల విజిలెన్స్ విభాగాలు నిఘాను పటిష్ఠపరచాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రలోభపెడితే పోలీసులకు ఫిర్యాదు చేయండి

సింగరేణిలో ఉద్యోగాలన్నీ పారదర్శకంగా భర్తీ చేస్తారు. ఎవరైనా దళారులు ప్రలోభపెట్టినా, డబ్బులు వసూలుచేసినా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆ సంస్థ 'పా' విభాగం డైరెక్టర్ ఒకరు తెలిపారు. ఒకవేళ సింగరేణి ఉద్యోగి మోసానికి పాల్పడితే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

సింగరేణిలో ఉద్యోగాలిప్పిస్తానని నమ్మబలికి మధ్యవర్తుల ద్వారా కొత్తగూడెం రుద్రంపూర్‌కు చెందిన ఓ దళారీ పెద్దఎత్తున డబ్బులు దండుకున్నాడు. మోసపోయామని గుర్తించిన బాధితులు రెండేళ్ల క్రితం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఒప్పంద ఉద్యోగాల పేరిట గతేడాది కొంతమంది దగ్గర ఓ నాయకుడు డబ్బు వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

'కారుణ్య' కొలువులు ఇప్పిస్తామని పలువురి వద్ద డబ్బులు వసూలు చేశాడన్న ఆరోపణతో ఓ ఉద్యోగిని ఇటీవల యాజమాన్యం విధుల్లోంచి తొలగించింది. ఉద్యోగాలిప్పిస్తామంటే నమ్మి.. అప్పుచేసి రూ.లక్షలు ముట్టజెప్పిన జూలూరుపాడుకు చెందిన రత్నకుమార్, పార్వతి దంపతులు తాము నిలువునా మోసపోయామని బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన గత సోమవారం చోటుచేసుకుంది.

# స్థల పంచాయితీ

సారంగాపూర్ : మండలంలోని ఓ గ్రామంలో కొంత కాలంగా సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలోకి డీసీఎంఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో గ్రామంలో వివాదం నెలకొంది. రైతులతో కలిసి నిర్వాహకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకొనే పరిస్థితి ఏర్పడింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన స్థలంలో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో కేంద్రాన్ని మంజూరు చేయడంతో స్థల విషయంలో ఇరు గ్రామాల మధ్య ఉద్రిక్తతకు దారితీసింది. కేవలం ఇక్కడే కాకుండా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఇదే సమస్య నెలకొంది. అయితే కొన్ని కేంద్రాలను అధికారులు కుదించినప్పటికీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు మళ్లీ మంజూరు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఒక్కో గ్రామానికి రెండేసి కొనుగోలు కేంద్రాలు మంజూరు చేయడం.. ఉన్న కేంద్రానికి సరైన స్థలం లేకపోవడంతో మరో కొనుగోలు కేంద్రాన్ని కేటాయించడంతో గ్రామాల్లో వివాదాలు నెలకొంటున్నాయి. జిల్లాలో 380 పంచాయతీలకు గానూ జిల్లా వ్యాప్తంగా 427 కొనుగోలు



కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో సెర్ప్ ద్వారా 175, సహకార సంఘాలు, డీసీఎంఎస్‌లకు 251, మెప్మా ద్వారా ఒక కొనుగోలు కేంద్రం అప్పగించారు. కొనుగోలు కేంద్రాలు ఎక్కువగా ఉండడంతో సేకరణ వేగవంతం అవుతున్నప్పటికీ స్థలాలు లేకపోవడంతో రైతులకు ఇబ్బందిగా మారింది.

నిర్వాహకులకు తాఖీదులు

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యానికి వచ్చే కమీషన్‌లో సగానికిపైగా నిర్వహణ వ్యయం చేయడంతో జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఒక్కో కేంద్రంలో కనీసం 5 వేల క్వింటాళ్లకు పైగా కొనుగోలు చేసినప్పుడే నిర్వహణ వ్యయం తగ్గి ఇబ్బంది లేకుండా ఉంటుంది. అయితే పలు కొనుగోలు కేంద్రాల్లో 2 నుంచి 3 వేల క్వింటాళ్ల సేకరణ దాటకపోవడంతో ఆయా కొనుగోలు కేంద్రాలకు నిర్వహణ వ్యయం పెరిగి నష్టాలు వస్తున్నాయి. అంతేకాకుండా కొన్నేళ్లుగా కమీషన్ పెంచకపోవడం.. వ్యయ ఖర్చులు పెరగడం నిర్వాహకులకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వసతులు కరువు

గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలకు సరైన స్థలాలు లేకపోవడంతో పంట పొలాలు, రహదారుల వెంట ధాన్యాన్ని ఆరబోయాల్సి వస్తోంది. వానాకాలం తేమ శాతం ఎక్కువగా ఉండడంతో ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు స్థలం ఎక్కువగా అవసరం ఉండడమే కాకుండా ఎక్కువ రోజులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని ఉంచాల్సిన పరిస్థితితో స్థలాల సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. పంట పొలాల్లో ఆరబెట్టుకునేందుకు ధాన్యం పోసినప్పుడు వర్షాలు పడితే రైతుల పరిస్థితి దయనీయంగా మారుతుంది. కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ పెంచి కొనుగోళ్లను వేగవంతం చేసినప్పుడే సమస్యలు రాకుండా ఉంటాయని రైతులు పేర్కొంటున్నారు.

# అనాథల పెన్నిధి.. అభాగ్యుల సన్నిధి

మఠంపల్లి : ఆధ్యాత్మిక జీవనం గడుపుతున్న ఓ యువ విద్యావేత్త అభాగ్యులతో పాటు అనాథలను ఆదుకోవాలని భావించారు. మానవ సేవే మాధవ సేవగా తలంచారు. ఓ క్రైస్తవ మిషనరీ సంస్థ నడుపుతున్న విద్యాలయానికి వ్యవహారకర్తగా, ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహిస్తూనే మురికి వాడల్లో నివసించే దీనులను, వీధి బాలలను ఆదుకునేందుకు విదేశాలలో ఉంటున్న మిత్రుల సహాయాన్ని కోరారు. సన్నిహితుల దాతృత్వానికి తన వితరణను జోడించి కూడూ, గూడు లేని దీనులతో పాటు తల్లిదండ్రులకు దూరమైన వీధి బాలలను, అనాథలను ఆదుకుంటున్నారు. పేదరికంతో చదువులు కొనసాగించ లేని విద్యార్థులను గుర్తించి వారికి ఉపకార వేతనాలు అందిస్తూ ఉన్నత విద్యలకు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారు. పూరిగుడిసెల్లో నివసిస్తూ ఆకలితో అలమటించే ఆర్తులకు ప్రతి నెలా బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నారు.

సేవా నిరతిని చాటుకుంటున్నారిలా..మఠంపల్లికి చెందిన తిరుమలరెడ్డి తోమాస్‌రెడ్డి, సెలీనమ్మ కుమారుడు ఫాదర్ టీఆర్ బాలజోజిరెడ్డి గురుపట్టం స్వీకరించాక ఎంఎస్సీ, ఎంఎడ్, ఎంబీఏ పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పెడన మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సెయింట్ విన్సెంట్ పలోటీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అండ్ కరస్పాండెంట్‌గా పని చేస్తున్నారు. 2007 నుంచి విద్యా బోధనలో తరిస్తున్న ఫాదర్ 2018లో తన సేవా కార్యక్రమాలను ప్రారంభించారు.



పెడన పట్టణ పరిధిలో 30 కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నారు. కొవిడ్–19 సమయంలో 40 రోజుల పాటు తమ పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో నిత్యం 400 మందికి అన్నం ప్యాకెట్లు సరఫరా చేశారు. 45 మంది వీధి బాలలను, 35 మంది అనాథలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు నోటుపుస్తకాలు, దుస్తులు అందజేస్తున్నారు. 100 మందికి పైగా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తూ ఉన్నత విద్యలకు తోడ్పాటు నందిస్తున్నారు. మఠంపల్లిలో ఒంటరి మహిళలు, వితంతువులకు 2021 నుంచి ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణానంతరం రాయితీపై మిషన్లు అందజేస్తున్నారు. నిస్సహాయులైన 100 మంది వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేయడం వంటివి గత ఆరేళ్లుగా కొనసాగిస్తున్నారు. సామాజిక బాధ్యతతోనే ఇలాంటి కార్యక్రమాలను మిత్రబృందం సహాయంతో చేపడుతున్నట్లు ఫాదర్ బాలజోజిరెడ్డి చెప్పారు.

# చన్నీళ్ల స్నానం.. వెంటిలేటర్ల నుంచి గాలి



సిరిసిల్ల : వసతి గృహాల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం చలి కావడంతో పిల్లలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. కొన్ని చోట్ల కనీసం దుప్పట్లు ఇవ్వలేదు. చలిలో చన్నీళ్లతో స్నానం చేస్తుండటంతో వణుకుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతుంది. చలికాలం కావడంతో ప్రభుత్వం దుప్పట్లు అందజేసినా వెంటిలేటర్ల నుంచి చలివేస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. ఉదయం చన్నీళ్లతో స్నానం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కిటికీలకు జాలీలు కూడా లేవు. తెల్లవారుజామున చలి ఎక్కువగా వస్తుందని విద్యార్థులు తెలిపారు.

జిల్లాలోని వసతి గృహాల వివరాలు

జిల్లాలో మొత్తం 9 బీసీ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో ప్రీ మెట్రిక్ 3 నుంచి 5వ తరగతి వరకు అయిదు ఉండగా, వీటిలో 214 మంది విద్యార్థులు ఉంటున్నారు. పోస్ట్‌మెట్రిక్, ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు నాలుగు వసతి గృహాలు ఉండగా 355 మంది చదువుకుంటున్నారు. ఎస్సీ వసతి గృహాలు ప్రీ మెట్రిక్ 9 ఉండగా 484 మంది, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు 3 ఉండగా 230 మంది ఉన్నారు. ఎస్టీ ప్రీ మెట్రిక్ హాస్టల్ ఒకటి ఉంది. ఇందులో 37 మంది ఉంటున్నారు.

తెరలు తొలగిపోతున్నా...

మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 55 మంది విద్యార్థులు ఉన్నారు. వార్డెన్ లేకపోవటంతో ఎస్సీ బాలికల వసతి గృహం వార్డెన్ వసంతకు బాధ్యతలను అప్పగించారు. చలికాలం కావటంతో ముందస్తుగానే విద్యార్థులకు దుప్పట్లు అందించారు. దోమలు రాకుండా కిటికీలకు ఏర్పాటు చేసిన తెరలు తొలగిపోతున్నాయి. విద్యుత్తు వైర్లు సక్రమంగా లేవు. వదులు తీగలతో ప్రమాదకరంగా మారాయి. తెరలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీనిపై వార్డెన్‌ను వివరణ కోరగా కోతుల బెడద తీవ్రంగా ఉందని, కోతులు తెరలను తొలగిస్తున్నాయని తెలిపారు.

దుప్పట్లు ఏవి?

మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల, వసతి గృహంలో 96 మంది ఉంటున్నారు. సుమారు 35 మంది విద్యార్థులకు మంచాలు లేవు. దీంతో కిందనే నిద్రిస్తున్నారు. పాఠశాల పునఃప్రారంభం తరవాత బెడ్‌షీట్లు, కార్పెట్లు అందించారు. చలికాలం ప్రారంభమైంది. స్వెట్టర్లు, దుప్పట్లు అందించాల్సి ఉన్నా నేటికీ అందలేదు. దీంతో విద్యార్థులు అందుబాటులో ఉన్న బెడ్‌షీట్లు, చద్దర్లు కప్పుకుంటున్నారు.

కొత్తవి ఏర్పాటు చేయక...

మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల, కళాశాల ఉన్నాయి. అందులో అయిదు నుంచి 10వ తరగతి వరకు 469 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 126 మంది ఉన్నారు. గురుకుల పాఠశాల, కళాశాల భవనాలకు మొత్తం 98 కిటికీలు ఉండగా 36 కిటికీల జాలీలు దెబ్బతిన్నాయి. కొత్తవాటిని ఏర్పాటు చేస్తే చలి రాకుండా ఉంటుంది. దీనిపై ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్‌ను వివరణ కోరగా జాలీల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. కళాశాల ల్యాబ్‌ల కోసం గదుల కొరత ఉండగా రూ.కోటి వ్యయంతో భవన నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో 9 బీసీ వసతి గృహాలు ఉండగా వీటిలో 6 ప్రభుత్వ, 3 ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్నాం. ప్రైవేట్ వసతి గృహాలకు గత కొన్ని నెలలుగా అద్దె విడుదల చేయలేదు. వాటిలో చిన్న చిన్న మరమ్మతులు ఉంటే యజమానులు చేయిస్తున్నారు. పెద్దవి అయితే అద్దె చెల్లిస్తేనే చేస్తామంటున్నారు.

రాజమనోహర్‌రావు, జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారి

# అభివృద్ధి జాడ.. జిల్లా అంతా 'సుడా'!




కరీంనగర్: సుడా పరిధి పెరిగింది. అభివృద్ధి జాడలను మరింత విస్తరించుకుంది. కరీంనగర్ జిల్లా మొత్తం ఇక శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ(సుడా) పరిధిగా మారిపోనుంది. ఇందుకు సంబంధించి రాజముద్రను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జారీ చేసింది. గతంలో పంపిన ప్రతిపాదనల ఆధారంగా ఈనెల 15వ తేదీన ఉత్తర్వులను వెల్లడించింది. చొప్పదండి మండలం ఆర్నకొండ నుంచి ఇల్లందకుంట మండలం పాతర్లపల్లి వరకు.. గన్నేరువరం మండలం పారువెల్ల నుంచి కరీంనగర్ గ్రామీణ మండలం దుర్శేడ్ వరకు ప్రతి గ్రామం పట్టణాభివృద్ధిలో భాగంకానుంది.

ఏడేళ్ల కిందట ఏర్పాటైన సుడా క్రమంగా విస్తరించింది. మొదట కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు 61 రెవెన్యూ గ్రామాలతో ముడిపడిన ప్రాంతంగా ఆవిర్భవించింది. ఇందులోనే కాలక్రమంగా కొత్తపల్లి పురపాలిక అంతర్భాగమైంది. ఒక నగరపాలక సంస్థ, ఒక పురపాలికతోపాటు మిగతా గ్రామాలపై పర్యవేక్షణ కొనసాగింది. పెరుగుతున్న జనాభా, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పరిధిని మరింత విస్తరించాలనే డిమాండ్ కొన్నాళ్లుగా వినిపించింది. ఇందుకనుగుణంగా ఇప్పుడు కొత్తగా అభివృద్ధికి చిగుర్లు తొడిగేందుకు మిగతా 3 పురపాలికలు (జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి)తోపాటు 147 రెవెన్యూ గ్రామాలను కలుపుకొని సరికొత్త పట్టణాభివృద్ధి సంస్థగా రూపుదిద్దుకుంది. మొత్తంగా జిల్లాలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలు, మధిర గ్రామాలన్ని సుడాలోకి వచ్చేశాయి.

మారిన స్వరూపం..

విస్తరించిన పరిధితో సుడా స్వరూపం పూర్తిగా మారిపోయింది. 2017 అక్టోబరు 24న సుడా ఏర్పాటైంది. సరిగ్గా ఏడేళ్ల తరువాత మళ్లీ విస్తరణకు ఆదేశాలొచ్చాయి. అప్పుడు 8 మండలాల్లో ఉన్న పరిధి 16 మండలాలకు మారింది. 4.59 లక్షల జనాభా 527.29 చ.కి.మీ విస్తీర్ణం ఉండేది. ఇప్పుడు దాదాపు 11 లక్షల జనాభాతో జిల్లా భౌగోళిక విస్తీర్ణం 2128 చ.కి.మీ సుడాలో కలిసిపోయింది. భవిష్యత్తులో బృహత్తర ప్రణాళికను అంతటా అమలు చేస్తే సరికొత్త అభివృద్ధి అన్ని గ్రామాల్లో కనిపించే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు సమృద్ధిగా అందుతాయి. విస్తరణతో ప్రగతి పరంగా కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రణాళికాయుతంగా..

పరిధి పెరగడంతో ప్రణాళికాయుతంగా అభివృద్ధిని చేసుకునే అవకాశముంటుంది. ప్రజలకు అందించే సేవలో మా బాధ్యత పెరగనుంది. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. పెరిగిన తీరునుబట్టి సిబ్బంది నియామకంతోపాటు నిధులు మరిన్ని తీసుకొచ్చే దిశగా ప్రత్యేక చొరవ చూపిస్తాను. ఇక్కడ అక్కడ అని తారతమ్యం లేకుండా జిల్లా అంతా సమానాభివృద్ధికి అవకాశం ఉంటుంది.

కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సుడా ఛైర్మన్

# బోర్డులు పెడితే వదిలేస్తామా..?

హైదరాబాద్ : శంషాబాద్ విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు పెరుగుతుండడంతో అక్రమార్కుల కన్ను ప్రభుత్వ ఖాళీ స్థలాలపై పడుతోంది. ముందుగా తాత్కాలిక షెడ్లు వేసి పనికానిచ్చేస్తున్నారు. ఈ క్రమంలోనే సర్వే నంబరు 626లో 12 ఎకరాల భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారు. శంషాబాద్ రెవెన్యూ అధికారులు కొద్దిరోజుల క్రితం తాత్కాలిక నిర్మాణాన్ని తొలగించి ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఏర్పాటు చేశారు. మరుసటి రోజే అక్రమార్కులు దాన్ని తొలగించి రేకులతో షెడ్డు వేశారు. మళ్లీ అధికారులు రేకులను తీసేయంతో కబ్జాదారులు ఈసారి ఇనుప కంచె ఏర్పాటు చేశారు. దీంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. హెచ్ఎండీఏకు భూములిస్తే... శంషాబాద్ మండలంలోని రాళ్లగూడ రెవెన్యూ పరిధిలో సర్వేనంబరు 626లో 360 ఎకరాల సర్కారీ భూములను కొన్నేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించింది. మొత్తం భూమిలో 12 ఎకరాల్లో గుట్టలు, రాళ్లు ఉండడంతో అధికారులు పట్టించుకోలేదు. విమానాశ్రయం, బాహ్యవలయ రహదారి ఈ భూములకు సమీపంలో ఉండడంతో అక్రమార్కులు ఆ 12 ఎకరాలను సొంతం చేసుకునేందుకు నకిలీ పత్రాలు సృష్టించారు. అధికారులు మూసీ పునరుజ్జీవం పనుల్లో ఉండడంతో అక్రమార్కులు వేగంగా పావులు కదిపారు. వారం రోజుల్లోనే భారీ పొక్లెయిన్లతో మొత్తం చదును చేశారు.

సీసీ కెమెరాలతో నిఘా... 12 ఎకరాల్లో ఏడెకరాల ప్రభుత్వ భూమి



వారసత్వంగా వచ్చిందంటూ ఓ ప్రైవేటు వ్యక్తి కంటెయినర్‌ను ఆ స్థలంలో ఉంచారు. మరో 5 ఎకరాల్లో ఇంకో వ్యక్తి ఇనుప కంచెలు, రేకులతో షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆక్రమించుకున్న స్థలం వద్దకు ఎవరొచ్చినా తెలుసుకునేందుకు వీలుగా వారు అక్కడ సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. ఈ భూములకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో కొంత మంది స్థిరాస్తి వ్యాపారులు కొనుగోలు చేసి క్రయవిక్రయాలు చేయడమే కాకుండా నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

# పత్తి రైతుకు మద్దతు కరవు

మోత్కూరు : వర్షాలు, చీడపీడలను ఎదుర్కొని పత్తి పండించిన రైతుకు ఏరివేత కష్టాలు మొదలయ్యాయి. కూలీలు దొరకక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏరిన పత్తిని అమ్ముదామంటే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభంకాకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు ధర తగ్గించడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని కర్షకులు దిగులు చెందుతున్నారు.

కిలో లెక్కన కూలికి డిమాండ్

పత్తి ఏరేందుకు కూలీలకు రోజుకూలి రూ.300 నుంచి రూ.350 వరకు ఇస్తున్నారు. కొన్నిచోట్ల కిలోలెక్కన కూలి ఇస్తేనే వస్తామని కూలీలు స్పష్టం చేస్తున్నారు. సేకరించిన పత్తి కిలోకు రూ.12 నుంచి రూ.13 వరకు అడుగుతున్నారు. ఇలా రెండు రకాలుగా కూలి ఇద్దామన్నా కొందరు పనికి రావడం లేదు. కిలోకు రూ.15 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పైగా కూలీలను తీసుకెళ్లేందుకు ఆటో, మధ్యాహ్నం శీతల పానీయాలకు ఖర్చు చేయాల్సి వస్తోంది. రైతులంతా ఒకే సమయంలో దూది సేకరిస్తుండటంతో కూలీల కొరత ఏర్పడింది.

ధర తగ్గించి కొనుగోళ్లు

కూలీలకు ఎక్కువ కూలి చెల్లించి దూది సేకరించినా సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేక రైతులకు అమ్మకం కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం ఈ సారి పత్తికి క్వింటాకు మద్దతు ధర రూ.7,521 చెల్లిస్తామని



ప్రకటించింది. మొదటి విడతలో పత్తి విక్రయించిన రైతులకు ప్రైవేట్ వ్యాపారులు రూ.ఏడు వేల వరకు చెల్లించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఆలస్యం కావడంతో ప్రైవేట్ వ్యాపారులు సిండికేట్‌గా మారి రూ.5,500లకు ధర తగ్గించేశారు. ఒత్తిడి తెస్తే రూ.ఆరు వేలకు కొంటున్నారు. తేమ, నాణ్యత లేదని కోతలు విధిస్తూనే తూకంలో మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పండగ తర్వాత ప్రారంభిస్తాం– ఉమామహేశ్వర్‌రావు, మార్కెట్ కార్యదర్శి, మోత్కూరు

మోత్కూరు ప్రాంతంలో ఆరు పత్తి మిల్లులున్నాయి. వీటిల్లో నవంబరు మొదటి వారంలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తాం. ప్రస్తుతం తేమశాతం అధికంగా ఉంది. అందుకే పండగ తరువాత కొనుగోళ్లు చేపడతాం.

పొద్దంతా ఏరితే తక్కువ కూలా?

– వేముల పద్మ, కూలీ, బుజిలాపురం

పత్తి ఏరేందుకు కూలికి పోతే రూ.300 నుంచి రూ.350 వరకే ఇస్తున్నారు. పొద్దంతా ఎండలో ఏరితే తక్కువగా కూలి ఇస్తున్నారని ఎక్కువ మంది రావడం లేదు. కిలోకు రూ.12 నుంచి 15 వరకు ఇస్తేనే వస్తామంటున్నారు. కిలో లెక్కన రోజుకు 40 నుంచి 50 కిలోల దూది ఏరితే గిట్టుబాటు అవుతుంది.నష్టాలే మిగులుతున్నాయి..– బొమ్మగాని లక్ష్మయ్య, రైతు, లక్ష్మీదేవికాల్వఎనిమిదెకరాల్లో పత్తి సాగు చేశాను. ఎకరాకు రూ.30 నుంచి రూ.35 వేల దాకా ఖర్చయ్యింది. దిగుబడి ఎకరాకు ఐదు నుంచి ఆరు క్వింటాళ్లే వస్తోంది. ముసురు వానలకు గూడ రాలిపోయి దిగుబడి తగ్గింది. పత్తి ఏరేందుకు రోజు కూలి రూ.400 ఇస్తామన్నా కూలీలు రావడం లేదు. ఇటు వ్యాపారులూ క్వింటాకు మద్దతు ధరకంటే తక్కువగా రూ.5,900లకే కొంటున్నారు. ఈసారి రైతులకు ఏమీ మిగిలే పరిస్థితులు లేవు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరిస్తే కొంత ఊరట లభిస్తుంది.

# నాడు ఆహ్లాదం.. నేడు అధోగతి

పాల్వంచ : కేటీపీఎస్ 'ఏ' కాలనీలోని 'విద్యుత్ కళా భారతి' కళతప్పి కనిపిస్తోంది. నిర్వహణను విద్యుత్తు సంస్థ అధికారులు పక్కనెట్టేశారు. తాజాగా జెన్కో క్రీడాపోటీల నేపథ్యంలోనైనా పూర్వ కళ సంతరించుకునేలా ఏర్పాట్లు పునరుద్ధరించాలని పురవాసులు, కేటీపీఎస్ ఉన్నతాధికారులను కోరుతున్నారు. కేటీపీఎస్ ఉద్యోగులు, వారి కుటుంబాల వ్యాహ్యాళి, జెన్కో క్రీడా పోటీల నిర్వహణకు దశాబ్దాల క్రితం 'కళా భారతి' మైదానాన్ని పట్టణం నడిబొడ్డున ఏర్పాటు చేశారు. సంస్థకు చెందిన వారే కాకుండా, పురపాలకానికి చెందిన పలు వార్డుల ప్రజలు నడక సాధన, చిన్నారుల ఆటవిడుపు కోసం ఇక్కడకు వస్తుంటారు. సెలవు రోజుల్లో అయితే వీరి సంఖ్య సుమారు వెయ్యి వరకు ఉంటుంది. కొన్నేళ్లుగా మైదానం నిర్వహణపై కేటీపీఎస్ యాజమాన్యం శీతకన్ను వేస్తోంది. వాకింగ్‌కు వచ్చేవారి సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోతోంది. కనీసం కాపలా వంటి ఏర్పాట్లూ లేకపోవడం, రాత్రుళ్లు నిర్మానుష్యంగా ఉంటుండటంతో మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. కొందరు అసాంఘిక కార్యకలాపాలకూ వేదికగా వాడుకుంటున్నారు. ఆవరణంలో పెరిగే పచ్చిక కోసం వచ్చే పశువుల తాకిడి ఎక్కువైంది. మరోవైపు శునకాల సంచారం నడక సాధకులను బెంబేలెత్తిస్తోంది. లక్షకు పైగా జనాభా గల పట్టణంలో ఉదయం, సాయంత్రం నడకకు ఎక్కువ సంఖ్యలో కళాభారతికే వస్తుంటారు. వచ్చేనెల 7వ తేదీ నుంచి టీజీ జెన్కో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలను నిర్వహిస్తున్నారు. కనీసం మైదానాన్ని శుభ్రం చేసి.. ఆటసామగ్రికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

కాపలాదారుణ్ని నియమించాలి

పట్టణం నడిబొడ్డున ఉన్న మైదానానికి గతంలో వేలాది మంది తరలివచ్చేవారు. రాత్రాను ఏర్పాట్లు, నిర్వహణపై దృష్టి తగ్గింది. కనీసం కాపలా అంటూ ఏమీ లేక కొందరు మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కనీసం సెక్యూరిటీ గార్డ్‌ను ఏర్పాటు చేస్తే రక్షణ, నిర్వహణకు వెసులుబాటు కలుగుతుంది. మరిన్ని సదుపాయాలు కల్పిస్తే పూర్వ వైభవం వస్తుంది.– దుర్గాప్రసాద్, పాల్వంచ

వసతులు కల్పిస్తే బాగు – రవీందర్, స్థానికుడు

ఉద్యోగులు, స్థానికులు వందలాది మంది మానసిక ఉల్లాసం కోసం రెండు పూటలూ తరలివస్తారు. ఉద్యోగాలకు సిద్ధమయ్యే కొందరు యువత వ్యాయామాలు, పరుగు సాధన చేస్తుంటారు. పిల్లల ఆటసామగ్రితో పాటు మరిన్ని వసతులు కల్పిస్తే మరింత ప్రయోజనంగా ఉంటుంది.

నిరుపయోగంగా పిల్లల ఆట సామగ్రి

కళాభారతి సమస్యలను కేటీపీఎస్ సివిల్ ఈఈ రాజీవ్ దృష్టికి తీసుకెళ్లగా.. మైదానం పరిశుభ్రతకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. వసతులు కల్పించాలన్న పురవాసులు డిమాండ్‌ను పరిశీలిస్తామని చెప్పారు.



# అమరావతి నిర్మాణానికి మంత్రాలయం పీఠాధిపతి రూ.50 లక్షల విరాళం

**మంత్రాలయం: సీఎం చంద్రబాబును ఉండవల్లిలోని నివాసంలో మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. పీఠాధిపతితో పాటు మఠం సభ్యులు ఆయన్ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సుబుదేంద్ర తీర్థులు మంత్రాలయం తరపున అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.50 లక్షలు విరాళంగా అందజేశారు. ఇందుకు గాను సీఎం వారికి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు మంత్రి లోకేశ్‌ను పీఠాధిపతి కలిసి ఆశీర్వదించారు.**

# ఏపీలో శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు జగన్ కుట్రలు: యనమల



అమరావతి: ప్రజా సమస్యలపై ఆందోళనలకు జగన్ పిలుపునివ్వడం హాస్యాస్పదమని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు.

గత ప్రభుత్వంలో చోటు చేసుకున్న తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వానికి ఆయన బదిలీ చేయాలనుకుంటున్నారని విమర్శించారు. ఖజానాను ఖాళీ చేసిన జగన్.. అధికారం లేకుండా ఉండలేక పోతున్నట్లుందని వ్యాఖ్యానించారు. అరాచక పాలనను కొద్ది నెలల క్రితమే ప్రజలు తిరస్కరించారని.. ఈ విషయాన్ని జగన్ గుర్తించాలని యనమల హితవు పలికారు. వైకాపా ప్రభుత్వంలో పడిన అష్టకష్టాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని యనమల అన్నారు.

వైకాపా ఆందోళనలతో రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు జగన్ కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. గతంలో చెన్నారెడ్డి పాలనలో ఇలాగే చేసిన అనుభవం వైఎస్ఆర్ కుటుంబానికి ఉందని గుర్తుచేశారు. జగన్ కేసుల విచారణలో వేగం పెరిగితే ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. వైఎస్ హయాంలో సెజ్ పేరుతో చిన్న, మధ్య తరహా రైతుల భూములను తీసుకున్న కేవీరావు పైనా కేసు నమోదు చేయాలని యనమల అన్నారు.





అమరావతి: వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డిపై ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం లుక్ అవుట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ) జారీ చేసింది. ఆయనతో పాటు వైకాపా ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి, అరబిందో యజమాని పెనక శరత్‌చంద్రారెడ్డిపైనా ఎల్‌వోసీ ఇచ్చింది. వీరు ముగ్గురూ విదేశాలకు పారిపోకుండా ముందు జాగ్రత్తగా ఈ సర్క్యులర్ జారీ చేసింది. కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్, కాకినాడ సెజ్‌లోని రూ.3,600 కోట్ల విలువైన వాటాలను కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీ రావు) నుంచి గత ప్రభుత్వ హయాంలో బలవంతంగా లాగేసుకున్నారంటూ సీఐడీ నమోదు చేసిన కేసులో వీరు కీలక నిందితులుగా ఉన్నారు. వాటాలు రాసివ్వకపోతే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామంటూ కేవీ రావును బెదిరించి, భయపెట్టి అత్యధిక శాతం షేర్లను అరబిందో సంస్థ పరం చేశారనేది వీరిపై ప్రధాన అభియోగం.




## జగన్ ప్రమేయం లేకుండా ఇది జరగదు: ఆనం వెంకట రమణారెడ్డి

నెల్లూరు: కాకినాడ సెజ్, పోర్టు ఆక్రమణల కేసులో జగన్‌ను ఏ౧గా ఎఫ్‌ఐఆర్‌లో సీఐడీచేర్చాలని ఆక్వాకల్చర్ అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి డిమాండ్ చేశారు. వైసీపీ నేతలు పందుల గుంపు మాదిరి 8320 ఎకరాల కాకినాడ సెజ్ దోపిడీకి దిగారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా గురువారం ఆయన నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ.. కత్తులు, గన్నులతో కేవీరావును అన్ని విధాలా బెదిరించి భయపెట్టి 4 వేల ఎకరాల భూమిని కేవలం 12 కోట్ల రూపాయల పేరుతో అప్పనంగా కొట్టేశారని ఆరోపించారు. భారతదేశంలో రూ.29 వేలకు ఎక్కడా దొరకని ఎకరా భూమి జగన్ వర్గీయులకు మాత్రమే కాకినాడ సెజ్‌లో ఎలా దొరుకుతుందని ఆయన ప్రశ్నించారు. డబ్బులు సంపాదించే కంపెనీని బెదిరించి గుంజుకోవటం వీరి నైజమని అన్నారు. ప్రముఖ కన్సల్టెంట్ రోహిత్ చతుర్వేది ఇచ్చిన నివేదిక ప్రకారం కాకినాడ సెజ్‌లో ఎకరా రేటు రూ. 50 లక్షల పైచిలుకు ఉందని ఆనం వెంకట రమణారెడ్డి అన్నారు. 2 వేల కోట్ల రూపాయల విలువైన కేవీరావు వాటా భూమిని రూ.12 కోట్లు ఇస్తామని చెప్పి కొట్టేశారన్నది సుస్పష్టమన్నారు. చెక్ రూపంలో ఇచ్చిన రూ. 12 కోట్లు కూడా 6 నెలల తర్వాత బ్యాంకులో జమ చేసుకోమనటాన్ని దోపిడీ అనాలా దొంగతనం అనాలా.. చెక్ రూపంలో ఇచ్చిన రూ. 12 కోట్లు 6 నెలల తర్వాత జమ కావటం సాధ్యమా.. అని ప్రశ్నించారు. జగన్ ప్రమేయం లేకుండా ఇది జరగని పని అని, కాకినాడ పోర్టు కైవసం కోసం భారీ మోసానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఒకే కంపెనీని ఇద్దరు కన్సెల్టెంట్లు ఆడిట్ చేసి వెయ్యి కోట్ల రూపాయలు ప్రభుత్వానికి కట్టాలని ఒత్తిడి తెచ్చారని, అలా కట్టని పక్షంలో పోర్టు స్వాధీనం చేయాలని బెదిరించి లొంగతీసుకోవటంతో పాటు షిప్పింగ్ ఏజెంట్లను భయపెట్టారని, కేవీరావు వాటా అమ్మే వరకూ గొంతుమీద కత్తి పెట్టి మరీ బెదిరించారని ఆనం వెంకట రమణారెడ్డి దుయ్యబట్టారు. కాగా వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ సీఐడీ విభాగం లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేసింది. ఆయనతోపాటు వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి, అరబిందో యజమాని శరత్ చంద్ర రెడ్డిపై ఎల్వోసీ ఇచ్చింది. ఈ ముగ్గురూ విదేశాలకు పారిపోకుండా ముందు జాగ్రత్తగా ఈ సర్క్యులర్ జారీ చేసింది. కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్, కాకినాడ సెజ్‌లోని రూ. 3,600 కోట్ల విలువైన వాటాలను కర్నాటి వెంకటేశ్వరరావు, కేవీ రావు నుంచి గత ప్రభుత్వ హాయంలో బలవంతంగా లాగేసుకున్నారంటూ సీఐడీ నమోదు చేసిన కేసులో కీలక నిందితులుగా వీరున్నారు. వాటాలు రాసివ్వకపోతే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని కేవీ రావును బెదిరించి, భయపెట్టి అత్యధిక షేర్లను అరబిందో సంస్థ సొంతం చేసుకుందనేది ప్రధాన అభియోగం. దీనిపై కేవీ రావు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు నమోదు చేసిన కేసులో విజయసాయిరెడ్డి, విక్రాంత్ రెడ్డి, శరత్ చంద్రారెడ్డి.. ఈ ముగ్గురు కీలక నిందితులుగా ఉన్నారు. కేవీ రావు స్టేట్‌మెంట్‌ను అధికారులు రికార్డు చేస్తున్నారు. విక్రాంత్ రెడ్డిపై ఇప్పటికే సీఐడీ గురిపెట్టింది. కేవీ రావుతోపాటు మరికొందరి స్టేట్‌మెంట్లు కూడా రికార్డు చేయాలని సీఐడీ అధికారులు భావిస్తున్నారు. అధికారులు కేసు రిజిష్టర్ చేసిన వెంటనే లుకౌట్ నోటీసులుజారీ చేశారు. ఈ ముగ్గురు విదేశాలకు పారిపోకుండా దేశంలో ఉన్న అన్ని విమానాశ్రయాలకు ఎల్వోసీలు పంపినట్లు సీఐడీ అధికారులు పేర్కొన్నారు. వారిని విచారించేందుకు త్వరలో నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.



# పీఎస్ఎల్‌వీ-సీ59 ప్రయోగం విజయవంతం.. శాస్త్రవేత్తల హర్షం

శ్రీహరికోట: శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్‌వీ–సీ59 వాహక నౌక నింగిలోకి విజయవంతంగా దూసుకెళ్లింది. గురువారం సాయంత్రం 4.04 గంటలకు వాహకనౌక నిప్పులు చిమ్ముతూ కక్ష్యలోకి ప్రవేశించింది. ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఇస్రోఛైర్మన్ ఎస్. సోమ్‌నాథ్.. శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ప్రోబా–3 ఉప గ్రహాలను విజయవంతంగా నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టగలిగామన్నారు. ప్రోబా తదుపరి చేపట్టే ప్రయోగాలకు ఇస్రో ఛైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్ఎస్ఐఎల్ భాగస్వామ్యంతో ఈ ప్రయోగం చేపట్టామని పేర్కొన్నారు. పీఎస్ఎల్‌వీకి మరిన్ని అవకాశాలు కల్పించిన ఎన్ఎస్ఐఎల్‌కు ధన్యవాదాలు తెలిపారు. తద్వారా మరిన్ని వైవిధ్యభరితమైన ప్రయోగాలకు వీలు కలుగుతుందన్నారు. డిసెంబరులో స్పేటెక్స్ పేరుతో పీఎస్ఎల్‌వీ–సీ60 ప్రయోగం ఉంటుందని ఇస్రోఛైర్మన్ తెలిపారు. ఈ ఉపగ్రహంతోనే ఆదిత్య ఎల్–1 సోలార్ మిషన్ కొనసాగుతుందన్నారు. ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)కు చెందిన ప్రోబా–3తో పాటు మరికొన్ని చిన్న ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ–సీ59 రాకెట్ ద్వారా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించింది. ప్రోబా–3లో రెండు ఉపగ్రహాలు ఉన్నాయి. వీటి బరువు 550 కిలోలు. సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాపై పరిశోధనలు చేయడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇందుకోసం అవి పరస్పరం సమన్వయంతో ఒక క్రమపద్ధతిలో భూకక్ష్యలో విహరిస్తాయి. ఈ తరహా ప్రయోగాన్ని చేపట్టడం ప్రపంచంలోనే ఇది మొదటిసారని ఈఎస్ఏ తెలిపింది.




# స్టెల్లా షిప్‌లో అణువణువూ తనిఖీ జరుగుతోంది: మంత్రి నాదెండ్ల

విశాఖ: బియ్యం అక్రమ రవాణాపై ఇప్పటి వరకు 1,066 కేసులు నమోదు చేశామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇప్పటివరకు కోటి ఇరవై టన్నుల బియ్యం అక్రమ రవాణా జరిగిందన్నారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్.. ప్రభుత్వంతో కలిసి పనిచేయాని సూచించారు. విశాఖ కలెక్టరేట్‌లో ప్రాంతీయ పౌరసరఫరాల శాఖపై జరిగిన సమీక్షకు మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. "ఉత్తరాంధ్రలో ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ఒక్క ఉత్తరాంధ్రలోనే 1.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నాం. రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే నగదు జమ చేశాం. విశాఖ, కృష్ణపట్నం పోర్టుల కంటే రెండింతల బియ్యం కాకినాడ పోర్టు నుంచి తరలిపోయింది. కాకినాడ పోర్టు ద్వారా బియ్యం అక్రమ రవాణాలో కొందరు సీనియర్ అధికారుల పాత్ర ఉంది. విశాఖ పోర్టుపైనా దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించాం.

కాకినాడు కలెక్టర్ ఆధ్వర్యంలో స్టెల్లా షిప్‌లో అణువణువూ తనిఖీ జరుగుతోంది. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సీబీ సీఐడీ విచారణకు ఆదేశించాం. ఇప్పటివరకు 729 మందిని, 102 వాహనాలను సీజ్ చేశాం. అక్రమార్కులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం"అని నాదెండ్ల హెచ్చరించారు.

# రైతులు.. మీరు మోసపోవద్దు

బాపట్ల జిల్లా : జిల్లాలోని వేమూరు నియోజకవర్గంలో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, పార్థసారథి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రులు పరిశీలించారు. అనంతరం మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. ధాన్యం తేమ శాతం 17% నుంచి 25% వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. బయట తక్కువ ధరకే అమ్ముకొని రైతులు మోసపోవద్దన్నారు. రైతుల దగ్గర్నుంచి ప్రతి గింజ ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. మిల్లర్లు ఎవరైనా సరే తేమ శాతం ఎక్కువ ఉందని రైతులను ఇబ్బంది పెడితే రైస్ మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రైతు భరోసా కేంద్రాల్లో వారితో పాటు మిల్లర్లు కూడా ఒకళ్ళు అందుబాటులో ఉండాలన్నారు. తేమశాతం పరిశీలించి ఫైనల్ చేయాలని సూచించారు. గత వైసీపీ హయాంలో ధాన్యం కొనుగోలు చేసిన ఆరు ఏడు నెలలకు గాని డబ్బులు రైతులు ఎకౌంట్లో పడేవి కాదని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటల్లో రైతుల అకౌంట్లో డబ్బులు వస్తున్నామని మంత్రి పార్థసారథి వెల్లడించారు.

**రైతులకు ప్రభుత్వం అండ: నక్కా ఆనందబాబు**... వర్షాలకు రైతులు కొంతమంది ఇబ్బంది పడ్డారని ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు అన్నారు. కూటమి ప్రభుత్వం హయంలో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా పంట కొనుగోలు చేస్తున్నామన్నారు. మిల్లర్లు అవకతవకలు చేస్తే అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. రైతులెవరు నష్టపోవద్దని.. ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన ఆరు ఏడు నెలలకు కూడా డబ్బులు పడతాయో లేదో తెలిసేది కాదన్నారు. వైసీపీ పార్టీ నాయకులు బ్రోకర్లు అవతారమెత్తి రైతులను మోసం చేశారని నక్కా ఆనంద్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.



**మంత్రి గొట్టిపాటి ఆగ్రహం...** వేమూరు నియోజకవర్గంలో పట్టపగలే లైట్లు వెలుగుతుండడంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా పగటి పూట విద్యుత్ దీపాలు వెలగడాన్ని ఫోటోలు తీసి పంపిస్తున్నారని తెలిపారు. విద్యుత్‌ను అవసరాల మేరకు మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యుత్‌ను వృథా చేయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పగటి పూట కూడా విద్యుత్ దీపాలు వెలగడంతో సంస్థపై భారం పడుతోందన్నారు. పగటిపూట వీధి దీపాలు వెలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలంటూ ఉన్నతాధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు జారీ చేశారు.

# వైకాపా నేతలకు వ్యవసాయంపై చర్చించే ధైర్యం ఉందా?: అచ్చెన్నాయుడు



అమరావతి: వ్యవసాయంతో పాటు అనుబంధ సంస్థలను వైకాపా ప్రభుత్వం నాశనం చేసిందని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయంపై చర్చకు వచ్చే ధైర్యం వైకాపా నేతలకు ఉందా? అని ప్రశ్నించారు. గతంలో ధాన్యం సేకరించి రైతులకు డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదని.. ఇప్పుడు ప్రకృతి విపత్తులు, తుపానులకు దెబ్బతిన్న ధాన్యాన్ని సైతం కూటమి ప్రభుత్వం సేకరిస్తోందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

# గన్నవరం ఎయిర్‌పోర్టులో తుపాకీ కలకలం.. విద్యార్థి అరెస్టు




విజయవాడ: గన్నవరం విమానాశ్రయంలో తుపాకీ కలకలం రేపింది. భద్రతా సిబ్బంది తనిఖీల్లో ఓ యువకుడి వద్ద ఓ తుపాకీతో పాటు రెండు బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఓ ప్రైవేటు యూనివర్సిటీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నట్లుగా గుర్తించారు.

గన్నవరం నుంచి ఢిల్లీ వెళ్తున్న సదరు విద్యార్థిని భద్రతా సిబ్బంది అనుమానించి తనిఖీ చేశారు. అతని వద్ద బుల్లెట్లు, తుపాకీ లభించడంతో వెంటనే అతడిని గన్నవరం పోలీసులకు అప్పజెప్పారు. దీంతో అతడు ఎవరు, తుపాకీని తనతో తీసుకువెళ్లాల్సిన అవసరం ఏంటనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# ఎల్లో ఎల్లో శ్రద్దా ఫెల్లో


సిద్దూ ఫ్రమ్ శ్రీకాకుళం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రద్దా దాస్. 2008లో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడు ఇప్పటికీ సినిమాలు, సిరీస్‌ల్లో అప్పుడప్పుడు కనిపిస్తూనే ఉంది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ కన్నుల విందు చేస్తోంది. సినిమాలతో కంటే ఈమెకు అందాల ఆరబోత ఫోటోలతో ఎక్కువ పాపులారిటీ వచ్చింది అనే టాక్ ఉంది. ఆ విషయం పక్కన పెడితే మరోసారి ఈ అమ్మడు అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. ఈసారి ఎల్లో డ్రెస్‌లో మెరిసిన శ్రద్దా ని చూసి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. రెగ్యులర్‌గా శ్రద్దా దాస్ అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం, అవి సోషల్ మీడియాలో వైరల్ కావడం చాలా కామన్‌గా జరుగుతూ ఉంటుంది. ఇప్పుడు అదే జరిగింది. ఈసారి ఎల్లో డ్రెస్‌లో కన్నుల విందు చేస్తోంది. ఎల్లో ఎల్లో అంటూ ఈ అమ్మడి అందాన్ని ఎన్నో రకాలుగా అభిమానులు వర్ణిస్తూ వస్తున్నారు. సోషల్ మీడియాలో ఎప్పటిలాగే ఈమె అందాల ఫోటోలు



వైరల్ అవుతూనే ఉన్నాయి. ఆకట్టుకునే అందం ఈ అమ్మడి సొంతం అంటూ కామెంట్స్ వస్తున్నాయి. టైట్ డ్రెస్‌లో థైస్ అందాలను చూపడంతో పాటు, క్లీ వేజ్ షో చేస్తున్న శ్రద్దా అందాల జాతరకి అంతా వావ్ అంటూ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. ఈ ఫోటోలు శ్రద్దా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కొన్ని గంటల్లోనే వేలల్లో లైక్స్ పడ్డాయి. దాదాపుగా మూడు మిలియన్‌ల ఫాలోవర్స్ కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా తన ఫాలోవర్స్ సంఖ్యను అంతకంతకు పెంచుకుంటూ వస్తోంది. హీరోయిన్‌గా పెద్దగా ఆఫర్లు రాకున్నా ఇలా అందాల ఆరబోత ఫోటోలతో ఇండస్ట్రీలో కొనసాగుతూ వస్తోంది. 1991, మార్చి 4న ముంబైలో బెంగాలీ తల్లిదండ్రులకు జన్మించిన శ్రద్దా దాస్ జర్నలిజంలో బ్యాచిలర్ ఆఫ్ మాస్ మీడియా పట్టభద్రురాలు. తండ్రి వ్యాపారవేత్త కాగా, తల్లి వైద్యురాలు. అయినా ఆమెకు మీడియా వైపు ఆసక్తి ఉండేది. అందుకే మాస్ కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ చేసింది. డిగ్రీ చదివే రోజుల్లోనే శ్రద్దా దాస్‌కి థియేటర్ ఆర్ట్స్‌లోనూ ప్రావిణ్యం దక్కింది. అప్పుడప్పుడు స్టేజ్ షోలు ఇవ్వడం వల్ల నటన వైపు ఆసక్తి కలిగింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టే అవకాశం రాగానే వదులుకోకుండా వచ్చిన అవకాశంను సద్వినియోగం చేసుకుంది.

## టబు గౌన్ తయారీకి నెల రోజులు?

హాలీవుడ్ వరల్డ్‌లో సీనియర్ నటి టబు పాపులారిటీ అంతా ఇంతా కాదు. ఆంగ్ లీ తెరకెక్కించిన ఆస్కార్ విన్నింగ్ మూవీ లైఫ్ ఆఫ్ పై సహా పలు హాలీవుడ్ చిత్రాల్లో టబు నటించారు. ఇప్పుడు అమెరికన్ టీవీ సిరీస్ - డూన్ ప్రోఫెస్సీలోను టబు నటించింది. ఇంతకుముందు విడుదలైన ట్రైలర్ లో టబు మెరుపులా కనిపించి ఆకట్టుకుంది. ఇప్పుడు న్యూయార్క్‌లో %ఎదీూ% డూన్: ప్రొఫెసీ వరల్డ్ ప్రీమియర్‌కు టబు హాజరయ్యారు. భారతీయ డిజైనర్లు అబూ జానీ సందీప్ ఖోస్లా కస్టమ్-మేడ్ చేసిన బ్లాక్ కోచర్ గౌనులో టబు షో స్టాపర్ గా నిలిచారు. ఫ్యాషన్ డిజైనర్స్ కి చెందిన ఇన్‌స్టాగ్రామ్ పేజీ డైట్ సబ్య ప్రపంచ ప్రీమియర్ నుండి టబు వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోకి రెవరెండ్ మదర్ టబు అని వ్యాఖ్యను జోడించింది. ఈ కస్టమ్ మేడ్ గౌను తయారు చేయడానికి ఒక నెల



పట్టిందని టబు వెల్లడించారు. అబు జానీ, సందీప్ ఖోస్లాను భారతదేశంలో అత్యంత పాపులర్ డిజైనర్లు అని అభివర్ణించారు. నేను వారిని ప్రేమిస్తున్నాను అని టబు అన్నారు. డూన్: ప్రోఫెసీ ప్రీమియర్ థీమ్ కి తగ్గ డిజైనర్ గౌన్ ఇది. ప్రొఫెసీ లుక్‌ని డీకోడింగ్ చేస్తూ డిజైనర్లు రూపొందించారు. అబు జానీ సందీప్ ఖోస్లా కస్టమ్ బ్లాక్ గౌను ప్రత్యేకత ఏమిటీ అంటే.. ఒక క్లాసిక్ అంగ్రాఖాను తిరిగి రూపొందించే ఒక రకమైన కోచర్ పీస్. డైట్ సబ్య ప్రకారం.. ఇది స్వచ్ఛమైన ఖాదీ సిల్క్‌తో తయారు చేసినది. 38 సంవత్సరాల క్రితం కనుగొన్న ఒక రహస్య ఆర్టిసానల్ సిగ్నేచర్ టెక్నిక్ ద్వారా సృష్టించిన ఆకృతి గల గౌను. ఆఫ్-షోల్డర్ ప్లంగింగ్ నెక్‌లైన్, ఫుల్-లెంగ్త్ స్లీవ్‌లు, బస్ట్ కింద సిన్చ్డ్ సిల్హౌట్.. ఫ్లోర్ స్కర్ట్‌తో పాటు ఫ్లోర్-లాంగ్ డిజైన్... డూన్: ప్రొఫెసీటీవీ సిరీస్ నవంబర్ 18 నుండి జియో సినిమాలో ప్రసారం కానుంది. ఈ సిరీస్‌లో సిస్టర్ ఫ్రాన్సిస్కా పాత్రలో టబు కనిపించనుంది. ఇది తిమోతీ చలమెట్ డూన్: పార్ట్ వన్‌కు ప్రీక్వెల్.





# మీర్జాపూర్ ది ఫిల్మ్.. పెద్ద ప్లానింగే ఇది..!



డిజిటల్ ఆడియన్స్ టార్గెట్ తో వస్తున్న వెబ్ సీరీస్ లు చాలానే ఉన్నాయి. అందులో క్రైం థ్రిల్లర్ సీరీస్ లకు మంచి డిమాండ్ ఉంది. అలాంటి సీరీస్ లకు ఒక బెంచ్ మార్క్ గా క్రేజ్ ఎచ్చుకున్న సీరీస్ మీర్జాపూర్. ప్రైమ్ వీడియోలో ఇప్పటివరకు 3 సక్సెస్ ఫుల్ సీజన్లను పూర్తి చేసుకున్న ఈ సీరీస్ కు సెపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. 2018 లో మీర్జాపూర్ తొలి సీజన్ రాగా ఆ టైం లో డిజిటల్ ఆడియన్స్ ను ఎట్రాక్ట్ చేసింది ఈ సీరీస్. ఇక 2020 లో మరో సీజన్ వచ్చి అది కూడా సూపర్ హిట్ అయ్యింది. ఈ ఇయర్ కూడా మీర్జాపూర్ 3వ సీజన్ రిలీజై మంచి ప్రేక్షకాదరణ పొందింది. పంకజ్ త్రిపాఠి, శ్వేతా త్రిపాఠి, దివ్యేందు శర్మ, శ్రియా పిల్గోంగర్, అలీ ఫజల్ ఈ సీరీస్ లో నటించారు. గుర్మీత్ సింగ్ డైరెక్ట్ చేసిన మీర్జాపూర్ సీరీస్ లకు ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉంది. ఐతే ఈ క్రేజ్ ని దృష్టిలో ఉంచుకుని మీర్జాపూర్ మేకర్స్ మీర్జాపూర్ ది ఫిల్మ్ అంటూ ఒక సినిమా చేస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్డేట్ ఫ్యాన్స్ ని సర్ ప్రైజ్ చేస్తున్నాయి. లేటెస్ట్ గా ఈ సీరీస్ గురించి మీర్జాపూర్ నటుడు అలీ ఫజల్ అదిరిపోయే న్యూస్ చెప్పారు. మిర్జాపూర్ లో చనిపోయిన పాత్రలన్నీ మీర్జాపూర్ సినిమాలో మళ్లీ తిరిగి వస్తాయని అన్నారు. అంటే ఇది సీరీస్ కి ప్రీక్వెల్ కథగా వస్తుందని చెప్పాడు. ఈ సీరీస్ కు ప్రేక్షకుల్లో ఉన్న బజ్ ని క్యాష్ చేసుకోవాలనే ఉద్దేశంతోనే మీర్జాపూర్ ది ఫిల్మ్ తెరకెక్కిస్తున్నారు. మీర్జాపూర్ సినిమా ను నార్త్ ఆడియన్స్ మాత్రమే కాదు సౌత్ ఆడియన్స్ కూడా బాగానే ఆదరిస్తున్నారు. ఐతే ఈ సీరీస్ ను సినిమాగా చేస్తున్నారు కాబట్టి అది నేషనల్ వైడ్ భారీ రిలీజ్ ఉండే ఛాన్స్ ఉంటుంది. మీర్జాపూర్ సీరీస్ అందులోని పాత్రలకు అలవాటు పడ్డ ఫ్యాన్స్ కి ఇది నిజంగానే మంచి శుభవార్త అని చెప్పొచ్చు. మీర్జాపూర్ ది ఫిల్మ్ సినిమా క్రైం థ్రిల్లర్ లో మరో సంచలనంగా మారుతుందని చెప్పొచ్చు. ప్రైం వీడియోస్ లో సూపర్ హిట్ సీరీస్ అయిన మీర్జాపూర్ ను సినిమాగా రాబోతుండగా మరి థియేట్రికల్ రిలీజ్ లో ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

# మాస్ జాతర.. లుక్కు అదిరింది రాజా



మాస్ మహారాజా రవితేజ 75వ చిత్రానికి "మాస్ జాతర" అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం, రవితేజ కెరీర్ లోనే ఒక సరికొత్త ట్రెండ్ సెట్ చేయనున్నట్లు తెలుస్తోంది భాను భోగవరపు రచయితగా, దర్శకుడిగా వ్యవహరిస్తున్న ఈ సినిమాను మొదట సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నారు. కానీ మధ్యలో షూటింగ్ కి బ్రేక్ రావడంతో ప్లాన్ మారింది. 2025 మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ అభిమానులను ఉర్రూతలూగించింది. జాతరల హడావిడి నేపథ్యంగా దీపావళి సంబరాలను తలపిస్తూ రవితేజ స్టైలిష్ గా, తుపాకీ పట్టుకుని నడుచుకుంటూ వస్తున్న లుక్ మాస్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్ లో ఉన్న ఎఫెక్ట్స్ రవితేజ పట్ల క్రేజ్‌ని మరింత పెంచాయి. జాతర నేపథ్యంలో టపాసుల వెలుగులు, అల్లరిమూకతో చుట్టూ ఉన్న ఆ ఫైర్ ఎలిమెంట్స్ పోస్టర్ లో సినిమాటిక్ గ్రాండియర్ ని సూచిస్తున్నాయి. రవితేజ - శ్రీలీల కాంబినేషన్ గతంలో "ధమాకా"తో సూపర్ హిట్ అందుకుంది. ఇప్పుడు "మాస్ జాతర" లో ఈ జంట మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. దర్శకుడు భాను భోగవరపు ఈ సినిమా గురించి చాలా నమ్మకంగా ఉన్నారు. "మాస్ జాతర" కథకు రవితేజ టైమింగ్, యాటిట్యూడ్ అద్భుతంగా సరిపోతాయట. ఇక ఈ సినిమా వినోదాన్ని మరియు మాస్ యాక్షన్ ఎలిమెంట్స్‌ని పటిష్టంగా అందించేందుకు చిత్ర బృందం కృషి చేస్తోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, విధు అయ్యన్న సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపడుతున్నారు. ఎడిటర్ గా నవీన్ నూలి వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా మాస్ ప్రేక్షకులకు అసలైన థియేట్రికల్ అనుభూతిని అందించడానికి ప్రతి విషయంలో జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య కలిసి భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో "మాస్ జాతర" తెలుగు సినీ ప్రపంచానికి మరపురాని అనుభూతిని ఇస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఇక ఇంతకు ముందు విడుదల చేసిన ప్రీ-లుక్ లో రెండు సిగరెట్లు పట్టుకున్న రవితేజ లుక్ సినిమాపై అంచనాలను పెంచింది. "మాస్ జాతర" సినిమా నిజంగా మాస్ ప్రేక్షకులకు, రవితేజ అభిమానులకు మరపురాని జాతరగా నిలిచిపోతుందనే నమ్మకంతో చిత్ర బృందం ఉంది. ఇక త్వరలోనే సినిమాకు సంబంధించిన టీజర్ పై క్లారిటీ ఇవ్వనున్నారు.

# రాశీ గేమ్ ప్లాన్ మార్చేసిందేమిటీ?


ఏబీపీ నెట్‌వర్క్ సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో నటి రాశి ఖన్నా IAS అధికారి కావాలనే కోరిక ఉన్నా కానీ, తాను సినిమాల్లో విజయవంతమైన వ్యక్తిగా మారడం వెనక తన ఊహించని ప్రయాణం ఉందని తెలిపింది. తన కెరీర్ మార్పును వివరిస్తూ... రాశి ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగిగా స్థిరమైన జీవితాన్నికోరుకున్నానని తెలిపింది. అయితే చివరికి నటన తనను పిలిచిందని వ్యాఖ్యానించింది. నా విజయానికి విధి, స్థిరమైన ఎంపికలే కారణమని తెలిపింది. తదుపరి ది సబర్మతి రిపోర్ట్ గురించి ప్రశ్నించగా...మూవీ గురించి ఎక్కువ



వెల్లడించకూడదని నిర్ణయించుకుంది. ఆమె కెరీర్‌లో కీలకమైన చిత్రంగా భావిస్తోంది. దీనికి కారణం .. ప్రభావవంతమైన సామాజిక సమస్యలను పరిష్కరించడానికి ఊహించిన ప్రాజెక్ట్ ఇది. రాశీ ఇటీవల తెలుగు, తమిళం, హిందీలో ఆదరణ పొందిన సినిమాల్లో నటించింది. రాజ్ అండ్ డీకే వెబ్ సిరీస్ ఫర్జీలోను కీలక పాత్రను పోషించింది. మునుముందు మరిన్ని వెబ్ సిరీస్ లకు సంతకాలు చేయనుందని తెలుస్తోంది. తెలుసు కదా.. అగాథియా లాంటి చిత్రాల్లో ను నటిస్తోంది.

## చిరుత బ్యూటీ స్టన్నింగ్ దీవాలి లుక్ చూసారా?

'చిరుత' సినిమాతో టాలీవుడ్ లో తెరంగేట్రం చేసిన నేహాశర్మ ఆ తరవాత సౌత్ లో కనిపించలేదు. కేవలం హిందీ చిత్రాల్లో నటించింది. ఇటీవల శర్మాగాళ్ కెరీర్ ఇటీవల అంతంత మాత్రమే. గత లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రెడీ అవుతోందని ప్రచారమైంది. తన తండ్రి, కాంగ్రెస్ నాయకుడు దీనిని ధృవీకరించినా నేహాశర్మ కేవలం పార్టీ ప్రచారానికే పరిమితమైంది. అదంతా గతం అనుకుంటే, ఈరోజు దీపావళి సందర్భంగా నేహా శర్మ కొత్త లుక్ లో కనిపించింది. పూర్తిగా రెడ్ కలర్ డిజైనర్ దుస్తుల్లో నేహా శర్మ ఎంతో



సాంప్రదాయబద్ధంగా కనిపించింది. రెడ్ లో నేహా ఎంతో అందంగా ఒద్దికగా కనిపించింది. ఎరుపు రంగు మఖమల్ డిజైనర్ గౌనులో నేహాశర్మ స్టన్నింగ్ అప్పియరెన్స్ తో మైమరిపించిందనే చెప్పాలి. ప్రస్తుతం శర్మా గాళ్ స్టిల్స్ అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. నేహా ఫుల్ కిక్కిస్తోందంటూ ఫ్యాన్స్ దీనిపై కామెంట్లు చేస్తున్నారు. చిరుత సీక్వెల్ చేస్తే తిరిగి టాలీవుడ్ కి వస్తుందా? అంటూ చరణ్ అభిమానులు వెర్రిగా ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతానికి నేహా శర్మ హిందీ పరిశ్రమలో ఓటీటీ ఆఫర్లకు ప్రాధాన్యతనిస్తోందని తెలిసింది.




ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికి ఇళ్లు ఇస్తామన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాల నమోదు యాప్ ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడారు. పేదల చిరకాల కోరిక సొంతిళ్లు అని.. పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. డిసెంబర్ 6 నుంచే లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పారు.

గత పదేళ్లలో పేదలకు ఇళ్లు నిర్మించలేదన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ఇందిరమ్మ ఇండ్లే కనిపిస్తున్నాయన్నారు పొంగులేటి. కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు.

**కీలక అంశాలు :** మొదటి ఏడాదిలో 4 లక్షల 50 వేల ఇళ్లు మంజూరు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు. 400 చదరపు అడుగుల్లో ఇంటి నిర్మాణం చేసుకోవాలి.

మొదటి విడతలో సొంతింటి స్థలం ఉన్న వాళ్లకు ప్రాధాన్యత. కుటుంబంలో మహిళ పేరుతో ఇల్లు మంజూ రు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు. 4 విడతల్లో లబ్ధిదారులకు నగదు జమ. మొదటి విడతల లక్షా 20 వేలు. స్లాబ్ పడిన తర్వాత లక్షా 75 వేలు.

# ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌ను ప్రారంభించిన సీఎం

హైదరాబాద్, డిసెంబర్ 5: ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ ప్రారంభమైంది. గురువారం ఉదయం ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ అప్లికేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా రేపటి (శుక్రవారం) నుంచి ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక జరుగనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. రూ.10 వేలతో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభమైందని.. ఇవాళ రూ.5 లక్షలకు చేరుకుందన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రతి పేదవాడికి.. రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం చేస్తున్నామన్నారు. ఆత్మగౌరవంతో బతకాలనేది ప్రతి ఒక్కరి కల అని అన్నారు. ఆత్మగౌరవంతో బతకాలనే కల నెరవేరాలంటే సొంతు ఇళ్లు ఉండాలన్నారు.

గుడిలేని ఊరు ఉండొచ్చేమోగానీ.. ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు లేదన్నారు. కూడు, గూడు, గుడ్డ అందరికీ అందాలనేదే కాంగ్రెస్ సర్కార్ ఆలోచన అని చెప్పుకొచ్చారు. తొలిదశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చామన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామన్నారు. తొలిదశలో అత్యంత పేదలకే మొదటి ప్రాధాన్యం ఉంటుందన్ని స్పష్టం చేశారు. తొలిదశలో ఎస్సీలు, ఎస్టీలు, ట్రాన్స్‌జెండర్లు, అత్యంత పేదలకు ప్రాధాన్యం ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



**మమ్మల్ని ఇరుకున పెట్టండి..** ప్రభుత్వానికి విపక్షాలు సూచనలు ఇచ్చే సంప్రదాయం గతంలో ఉండేదని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. ఆ సంప్రదాయాన్ని ఇప్పుడు దెబ్బతీస్తున్నారన్నారు. పాలక, ప్రతిపక్షాలు శత్రుపక్షాలు అన్నట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. పాలక, ప్రతిపక్షాలు కలిస్తేనే ప్రభుత్వమని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో ఇరుపక్షాలకు సమాన ప్రాధాన్యం ఉంటుందన్నారు.

పెద్దమనిషిగా కేసీఆర్ సూచనలు చేయాలని హితువుపలికారు. "మాకేమీ భేషజాలు లేవు.. పాలక పక్షాన్ని ప్రశ్నించండి. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలి. అవసరమైన సూచనలు చేయాలి" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.




హైదరాబాద్: భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం బంజారాహిల్స్ పీఎస్‌లో విధుకు ఆటంకం కలిగించారంటూ సీఐ రాఘవేంద్ర ఫిర్యాదు చేశారు. దీంతో కౌశిక్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులు 20 మందిపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసం వద్దకు భారీగా పోలీసులు చేరుకుని అరెస్ట్ చేశారు. ఆయన్ను అక్కడి నుంచి బంజారాహిల్స్ పీఎస్‌కు తరలించారు. అంతకుముందు మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తున భారాస కార్యకర్తలు కౌశిక్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకున్నారు. ఆయన ఇంట్లోకి వెళ్లేందుకు హరీశ్‌రావు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇంటి గేట్లు దూకి వెళ్లేందుకు కార్యకర్తలు యత్నించారు. ఈ క్రమంలో హరీశ్‌రావును గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. హరీశ్‌ను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకునేందుకు కార్యకర్తలు యత్నించారు. ఆ తర్వాత కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకు దిగిన భారాస నేతలను అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

**కౌశిక్‌రెడ్డిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు..** కౌశిక్‌రెడ్డిపై బంజారాహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ 57, 126(2), 127(2), 132, 224, 333, 451(3), 191(2), r/w 190, r/w 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆయన్ను కోర్టుకు తరలించేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు బంజారాహిల్స్ పీఎస్ వద్దకు కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాదులు చేరుకున్నారు. వారిని లోపలికి అనుమతించలేదు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అరెస్ట్ చేశారంటూ పోలీసులతో వారు వాగ్వాదానికి దిగారు.




దిల్లీ: దేశంలో రోడ్డు ప్రమాదాల కారణంగా నిత్యం ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ఘటనలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉన్నా.. ప్రజల నిర్లక్ష్యం వల్ల బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉందని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. తానూ కూడా బాధితుడినేని చెప్పారు. చట్టాలంటే ప్రజలకు భయంభక్తీ లేవన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు నితిన్ గడ్కరీ బదులిచ్చారు. "ఇక్కడ నాలుగు అంశాలు కీలకమైవని. రోడ్డు ఇంజినీరింగ్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, సమర్థంగా చట్టాల అమలు. ప్రజలకు అవగాహన కల్పించడం. ఇక్కడ సమస్య ఏంటంటే.. చట్టాలంటే ప్రజలకు భయం గానీ.. గౌరవంగానీ లేవు. రెడ్ సిగ్నల్ పడితే ఆగరు. హెల్మెట్ పెట్టుకోరు. నిన్నటికి నిన్న నా కళ్లముందే ఓ కారు రెడ్ సిగ్నల్ దాటుకుని వెళ్లిపోయింది. హెల్మెట్ ధరించని కారణంగా ఏటా కనీసం 30వేల మంది ప్రాణాలు కోల్పోతున్నట్టు నివేదికలు చెబుతున్నాయి" అని గడ్కరీ వివరించారు. "నేను కూడా రోడ్డు ప్రమాద బాధితుడినే. మహారాష్ట్రలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో నాకు యాక్సిడెంట్ అయి కాలు విరిగింది. అందుకే ఈ అంశం నాకు చాలా సున్నితమైంది. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వం ఎంత కష్టపడుతున్నా.. ఏటా 1.68లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. చట్టాల అమలు సరిగ్గా లేకపోవడమే దీనిక్కారణం.
ప్రజాప్రతినిధులు, మీడియా, సమాజం నుంచి సహకారం లేకుండా వీటిని తగ్గించడం సాధ్యం కాదు. జరిమానాలు పెంచినా ప్రజలు రూల్స్ పాటించట్లేదు" అని కేంద్రమంత్రి తెలిపారు. దీనిపై లోక్‌సభలో ప్రత్యేక చర్చ పెట్టాలని ఈ సందర్భంగా గడ్కరీ స్పీకర్‌ను కోరారు.

# టీజీపీఎస్సీపై అభ్యర్థుల్లో విశ్వాసం పెంపొందించేందుకు కృషి చేస్తా: బుర్రా వెంకటేశం



హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై పూర్తి స్థాయిలో అభ్యర్థుల్లో తిరిగి విశ్వాసం పెంపొందించేందుకు కృషి చేస్తామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. నాంపల్లిలోని కమిషన్ కార్యాలయంలో ఆయన ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన బుర్రా వెంకటేశం.. ఐఏఎస్ తన కల అన్నారు. కష్టపడి పబ్లిక్ సర్వెంట్‌గా మారిన తాను.. నిరుద్యోగ అభ్యర్థుల కోసం మూడున్నరేళ్ల సర్వీస్‌ని వదులుకుని టీజీపీఎస్సీ బాధ్యతలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఎప్పటికప్పుడు జాబ్ నోటిఫికేషన్‌లు ఇవ్వడంతో పాటు భర్తీ ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా చేపడతామని హామీ ఇచ్చారు. అభ్యర్థులు కమిషన్‌పై నమ్మకంతో పరీక్షలకు హాజరుకావాలని కోరారు.

**పేద కుటుంబం నుంచి ప్రస్థానం..** జనగామ జిల్లా ఓబుల్ కేశవాపురం గ్రామానికి చెందిన బుర్రా వెంకటేశం నిరుపేద కుటుంబం నుంచి వచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తొలి గురుకుల పాఠశాల సర్వేల్‌లో చదువుకున్నారు. 1989లో హైదరాబాద్‌లోని అంబేడ్కర్ కళాశాల నుంచి బీఏ, 1992లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 1995లో ఐఏఎస్‌కు ఎంపికై ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు వచ్చారు. 2005 నుంచి 2008 వరకు మెదక్ కలెక్టర్‌గా పనిచేశారు. అక్కడ చేసిన సేవలకు అమెరికాకు చెందిన సోషల్ అకౌంటబులిటీ ఇంటర్నేషనల్ అనే సంస్థ నుంచి సోషల్ అకౌంటబులిటీ-8000 ధ్రువపత్రం పొందడం గమనార్హం. అనంతర కాలంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో సేవలు అందించారు. ముగ్గురు ఐఏఎస్‌లతో కూడిన ఏపీ పునర్విభజన కమిటీలో సభ్యుడిగానూ వ్యవహరించారు.




## ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై పిటిషన్.. హైకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా విద్యార్థులకు పోషకాలతో కూడిన భోజనం వడ్డించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనల్లో నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. భోజనం వికటించిన ఘటనల్లో రెండు కమిటీలు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుకు ఏఏజీ తెలిపారు. బాధ్యులైన వాళ్లను ఇప్పటికే సస్పెండ్ చేసినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. నాణ్యమైన భోజనం అందించడానికి ఏజెన్సీలకు చెల్లించే డబ్బులను 40 శాతం పెంచినట్లు పేర్కొన్నారు. మరోవైపు పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. పీఎం పోషణ్ పథకంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలుండాలని చెప్పారు. కమిటీల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. కమిటీలు సరిగా పనిచేసేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. దీనికి బదులిస్తూ.. అన్ని కమిటీలు పని చేస్తున్నాయని ఏఏజీ తెలిపారు. దీంతో ఏఏజీ చెప్పిన వివరాలను హైకోర్టు నమోదు చేసింది.

**పురపాలికల్లో గ్రామ పంచాయతీల విలీనానికి మార్గం సుగమం...** గ్రామ పంచాయతీలను పురపాలికల్లో విలీనం చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ ప్రకారం విలీనం జరిగిందని చెప్పింది. పాలనలో భాగంగా చట్టాలను తీసుకొచ్చే అధికారం అసెంబ్లీకి ఉందని పేర్కొంది. రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 51 గ్రామపంచాయతీలను ఇటీవల పురపాలికల్లో విలీనం చేశారు. పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. దీంతో పురపాలికల్లో గ్రామ పంచాయతీల విలీనానికి మార్గం సుగమమైంది.


# ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు.. హామీలపై నిలదీస్తే అరెస్టులు: కేటీఆర్



హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులపై ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. "కాంగ్రెస్ పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులు చేస్తున్నారు. పాలనలో లోపాలను గుర్తు చేసినా, గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలించినా.. ప్రభుత్వం లాక్కుంటున్న భూములపై ఎదిరించినా కేసులు పెడుతున్నారు. కూల్చుతున్న ఇళ్లకు అడ్డొచ్చినా.. వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేస్తున్నారు. సూట్‌కేసులు మీకు .. అరెస్టులు మాకు. మాజీ మంత్రులు, మా నాయకులు హరీశ్ రావు, జగదీశ్ రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకుల అరెస్టు అప్రజాస్వామికం. తక్షణం వారిని విడుదల చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# సంధ్య థియేటర్ వద్ద తొపులాట ఘటన.. బాలుడి పరిస్థితి విషమం

హైదరాబాద్: సంధ్య థియేటర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన తోపులాటలో గాయపడిన బాలుడు శ్రీతేజ్ కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి విషమంగా ఉందని.. మరో 78 గంటలు అయితే గాని బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఏమీ చెప్పలేమని వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం శ్రీతేజ్‌కు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. రాత్రి నుంచి సామాజిక మాధ్యమాలు, పలు యూట్యూబ్ ఛానళ్లలో బాలుడు చనిపోయినట్టు అసత్య ప్రచారం జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమమ్యారు. దయచేసి అలాంటి వార్తలు ప్రసారం చేయొద్దని వారు వాపోయారు. అందరూ తమకు అండగా నిలవాలని కోరారు. పుష్ప-2 బెనిఫిట్ షో కోసం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్దకు బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో వచ్చిన చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు ఎగబడటంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయడంతో రేవతి(35) అనే మహిళతోపాటు ఆమె కుమారుడు శ్రీతేజ(9) కింద పడిపోయి జనం కాళ్ల మధ్య నలిగిపోయారు. ఆసుపత్రి చికిత్సలో పొందుతూ తల్లి మృతిచెందారు. కుమారుడి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రికి తరలించారు.



# మాజీ మంత్రి హరీశ్‌రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట

హైదరాబాద్: మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు విషయంలో ఆయన్ను అరెస్టు చేయవద్దని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు తదుపరి దర్యాప్తు చేపట్టవచ్చని పేర్కొంది. ఇందుకు హరీశ్‌రావు సహకరించాలని సూచించింది. ఆయనపై ఫిర్యాదు చేసిన చక్రధర్‌గౌడ్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది. హైదరాబాద్ పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో స్థిరాస్తి వ్యాపారి జి.చక్రధర్‌గౌడ్ రాజకీయ కక్షతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ హరీశ్‌రావు బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారంటూ తనతోపాటు రాధాకిషన్‌రావు తదితరులపై చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలపై పోలీసులు ప్రాథమిక విచారణ జరపకుండానే కేసు నమోదు చేశారన్నారు. ఫిర్యాదులో తనకు వ్యతిరేకంగా ఏమీ లేదని, దాన్ని కట్టుకథతో దాఖలు చేశారన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అరెస్ట్ చేస్తే తన రాజకీయ జీవితంతోపాటు ప్రతిష్ఠ దెబ్బతింటాయన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ఎప్పుడో జరిగిన సంఘటన అని, ఇంతవరకు పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదన్నారు. ఆయన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది.



# కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలి: మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్: భారాస నేతలకు అధికారం పోయిన తర్వాత కార్యకర్తలు గుర్తొచ్చారని మంత్రి కొండా సురేఖ అన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ గురించి మాట్లాడే అర్హత వారికి లేదని చెప్పారు. తెలంగాణ కోసం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాజీనామా చేశారన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సురేఖ మాట్లాడారు. "మంత్రి కోమటిరెడ్డి గురించి గంధపు చెక్కల వ్యాపారి ఒకరు అగౌరవంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కక్షపూరిత రాజకీయాలు చేయదు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారు. అసెంబ్లీకి రాని నాయకుడు ప్రతిపక్ష నేత ఎలా అవుతారు?కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చి మాట్లాడాలి. భారాస అధికారంలో ఉండగా రేవంత్‌రెడ్డిని గతంలో చిన్న డ్రోన్ కేసులో కక్షపూరితంగా అరెస్ట్ చేశారు"అని కొండా సురేఖ అన్నారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com